నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
1
నిజామాబాద్-కామారెడ్డి
బుధవారం | అక్టోబర్ 11, 2023 | www.navatelangana.com

తొలగిన పోస్టర్లు..

నవతెలంగాణ-మాచారెడ్డి

ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో పాల్వంచ మండలంలోని ఆరేపల్లి గ్రామంలో మంగళవారం గ్రామంలో ఉన్నటువంటి వివిధ రాజకీయ పార్టీల వాల్ పోస్టర్లను గోడ రాతలను రెవెన్యూ సిబ్బంది తొలగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాజకీయ పార్టీల నాయకులు తమకు సంబంధించిన ఫ్లెక్సీలు ఉంటే వెంటనే తొలగించాలని లేనిచో తామే తొలగించాల్సి వస్తుందని సూచించారు.


గోడలపై ఉన్న పార్టీల ప్రచార రాతల తొలగింపు

ఎంపీ బీబీపాటిల్‌ను కలిసిన ఆర్టీఏ బృందం

నవతెలంగాణ-లింగంపేట్

జహీరాబాద్ ఎంపీ బీబీ పటేల్‌ను మంగళవారం ఆర్టిఏ బృందం సభ్యులు మర్యాదపూర్వకంగా కలిశారు. హైదరాబాద్‌లో సాగర్ సొసైటీలోని ఎంపీ తన కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిసి పుష్ప గూచ్ఛ ఆరీఏ మరియు హ్యూమన్ రైట్స్ రాష్ట్ర జోనల్ ప్రధాన కార్యదర్శి లేగ్గేల రాజు తోటి బృందం సభ్యులు ఆయనను కలిశారు. ఎన్నికల సమీపిస్తున్నందుకు పార్టీ స్థితిగతులు అడిగి తెలుసుకున్నారు. పార్టీ కోసం కష్టపడి పనిచేయాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో కుమార్, రాజు, సాయి తదితరులు పాల్గొన్నారు.


ఎంపీ బీబీపాటిల్‌కు పుష్పగుచ్ఛం అందజేత


పెద్దఎత్తున రాస్తారోకో చేపట్టిన రేషన్‌లబ్ధిదారులు

రేషన్‌బియ్యం అందట్లేవు

- పిట్లం-బాన్సువాడ రహదారి పై రాంపూర్ గ్రామ ప్రజల ధర్నా

నవతెలంగాణ-పిట్లం

తమకు రేషన్ బియ్యం అందడం లేదని రాంపూర్ (కలాన్) గ్రామ ప్రజలు పిట్లం - రహదారిపై సోమవారం ధర్నా నిర్వహించారు. మండలంలోని రాంపూర్ (కలాన్)కు చెందిన డీలర్ గోపి గ్రామ ప్రజలకు కేటాయించిన ఒక వంద ఆరు కిలోల బియ్యముకు డిడి కట్టి బియ్యాన్ని సరఫరా చేయాల్సి ఉండగా డబ్బుల కొరతతో 35 క్వింటాళ్ల బియ్యముకు డిడి కట్టకుండా వచ్చిన బియ్యాన్ని ప్రజలకు సరి పెట్టడముతో మిగిలిన వారికి గత 20నెలలుగా బియ్యము అందడం లేదని గ్రామ ప్రజలు పెద్ద ఎత్తున గగ్గోలు పెడుతూ రాస్తారోకో నిర్వహించారు. విషయాన్ని పలుమార్లు మండల తహసిల్ కార్యాలయంలో ఫిర్యాదు చేసినప్పటికీ మండల తహసిల్ కార్యాలయ సిబ్బంది నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించారని ప్రజల ఆరోపించారు. తమకు కేటాయించిన రేషన్ బియ్యం అందించాలని బీష్మించి రోడ్డుపై బైఠాయించడంతో వాహనాలు బారులు తీరాయి. సుదూర ప్రయాణికులకు, కాలేజీ విద్యార్థులకు రెండు గంటలపాటు అంతరాయం ఏర్పడడంతో స్పందించిన జిల్లా సివిల్ సప్లై ఏఎస్ఓ నిత్యానందన్, డిటి మహమ్మద్ ఖలీఫ్ ఘటన స్థలానికి చేరుకొని రేషన్ డీలర్ 35 క్వింటాళ్ల బియ్యంకు డిడి కట్ట నందున తక్కువ బియ్యం రావటంతో ప్రజలందరికీ సరిపోలేదన్నారు. ఇకమీదట ప్రతి నెల పూర్తి రేషన్ బియ్యానికి డిడి కట్టించి సరఫరా చేస్తామని , దీంతో గ్రామ ప్రజలందరికీ ఎలాంటి కొరత రాకుండా చూస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

లెక్క ఇక పక్కాగా..

- ఎన్నికల ప్రచారం వ్యయం పరిశీలనకు ప్రత్యేక బృందం
- ప్రశాంతంగా.. పాదర్శకంగా ఎన్నికలు నిర్వహించేలా ఏర్పాట్లు చేస్తున్నట్టు అధికారుల వెల్లడి

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో అభ్యర్థుల ఖర్చును పర్యవేక్షించేందుకు ఈసారి పకడ్బందీగా ఏర్పాట్లు చేస్తున్నట్టు అధికార యంత్రంగం ముందస్తు చర్యలు చేపట్టారు. అయితే ప్రతిసారి లెక్కకు మించి ఖర్చు చేస్తుండటంతో ఎన్నికల వ్యయం అంతుచిక్కకుండా మారుతుంది. ప్రచారాలకు, ప్రలోబాలకు కోట్లాది రూపాయలు వెచ్చిస్తున్నట్టు బహిరంగ రహస్యమే. అయితే ఈసారి పకడ్బందీగా చర్యలు చేపట్టేందుకు అధికార యంత్రాంగం ముందస్తు చర్యలు చేపడుతున్నట్టు సమాచారం. లెక్కకు మించి ఖర్చు చేస్తున్న వారిపై ఏమైనా చర్యలు తీసుకుంటారో.. లేక అభ్యర్థులు ఇచ్చిన లెక్కలనే చూపి మమ అనిపిస్తారో వేచి చూడాలి

ఉమ్మడి నిజామాబాద్ జిల్లా వ్యాప్తంగా 9 శాసన సభ, 2 పార్లమెంట్ స్థానాలు ఉన్నాయి. శాసన సభకు పోటీ చేసే అభ్యర్థి రూ.40లక్షలకు మించకుండా, పార్లమెంటు స్థానానికి పోటీ చేసే అభ్యర్థి రూ.95లక్షలకు మించకుండా ఖర్చు చేయాల్సి ఉంటుంది. అయితే ఎన్నికలు వ్యయం.. ప్రజాస్వామ్యాన్ని ధనస్వామ్యంగా మారుస్తున్నట్టు ఆరోపణలు వ్యక్తమవు తున్నాయి. ప్రధాన పార్టీల అభ్యర్థులు గెలుపే ధ్యేయంగా లెక్కకు మించి ఖర్చు చేస్తున్నట్టు ఆరోపణలు వ్యక్తమవుతు న్నాయి. ప్రచార సమయంలో.. ప్రచారం ముగిసిన అనంతరం ప్రలోబాలకు తెరలేపుతూ విచ్చలవిడిగా డబ్బులు వెచ్చిస్తుండటం రివాజుగా మారింది.

లెక్క.. పక్కాగా సాగేనా..

ఎమ్మెల్యే స్థానానికి పోటీ చేసే అభ్యర్థి ప్రచార ఖర్చు రూ.40 లక్షలకు మించొద్దని ఎన్నికల సంఘం నిబంధనలు. ప్రచార సరళి, హాజరైన కార్యకర్తలు, వారికి వెచ్చిస్తున్న టీ, భోజనం, పాంఫ్లేట్లు, ప్రకటనలు తదితర ఖర్చులను లెక్కించేందుకు కొలమానం నిర్దేశించినా అందుకు అనుగుణంగా ఖర్చు చేస్తున్నారో లేదో పర్యవేక్షణ సరిగా జరగడం లేదని ప్రధాన ఆరోపణ. దీంతో పాటు పలువురు అభ్యర్థులు లోలోపల చేస్తున్న ఖర్చులు బయటకు రాకుండా చూస్తుండటంతో లెక్క పక్కాగా తేలడం లేదు. ఈసారైనా అధికార యంత్రాంగం పకడ్బందీగా చర్యలు చేపట్టి ఎన్నికల్లో ధనప్రవాహం లేకుండా పారదర్శకంగా పోలింగ్ జరిగేలా చూడాలని ఓటర్లు కోరుతున్నారు.



ఫిర్యాదులకు 'డయల్ 1950.. సీ-విజిల్ యాప్'

కాగా ఎన్నికల ప్రవర్తన నియమావళి ఉల్లంఘనలకు సంబంధించి ఫిర్యాదు చేసేందుకు ఎన్నికల సంఘం టోల్ ఫ్రీ నెంబర్ 1950 కేటాయించింద. అభ్యర్థులు లెక్కకు మించినట్టు ఖర్చు చేస్తున్నా.. ఎన్నికల నిబంధనలు పాటించకున్నా ఫిర్యాదు చేయొచ్చు. దీంతో పాటు సి-విజిల్ యాప్ ద్వారా లైవ్ ఫోటోలు, వీడియోల ద్వారా కూడా ఫిర్యాదు చేయవచ్చని అధికారులు పేర్కొంటున్నారు. ఫిర్యాదు అందిన వెంటనే ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు స్పందించి చర్యలు తీసుకోనున్నారు. కాగా ఈ బృందాల కదలికలను కూడా యాప్ ద్వారా ట్రాక్ చేసే వెసులుబాటు ఉన్నట్టు అధికారులు తెలిపారు.

బీఆర్ఎస్‌తోనే బీసీలకు న్యాయం

- నాయీ బ్రాహ్మణ ఆత్మీయ సమ్మేళనంలో ఎమ్మెల్సీ కవిత


మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కవిత

నవతెలంగాణ-కంఠేశ్వర్

దేశవ్యాప్తంగా బీసీలకు న్యాయం జరిపించటమే బిఆర్ఎస్ లక్ష్యం అని ఎమ్మెల్సీ కవిత అన్నారు. అన్నారు. కాంగ్రెస్ పాలనలో బీసీ లను పట్టించుకోలేదని రాహుల్ గాంధీ ఇందుకు సమాధానం చెప్పాలని అన్నారు. నగరంలో నాయి బ్రాహ్మణ ఆత్మీయ సమ్మేళనం మంగళవారం నిర్వహించారు. ఎమ్మెల్సీ కవిత హాజరై మాట్లాడారు. నాయీ బ్రాహ్మణులు అంటే విట్టలేశ్వరుని క్షవరం చేసిన చరిత్ర ఉందని అశ్విని దేవతల వారసులు నాయి బ్రాహ్మణులని ఎమ్మెల్సీ కవిత అన్నారు. నాయి బ్రాహ్మణులు లేకుంటే సమాజానికి ఎంతటి ఇబ్బంది ఉంటుందో సీఎం కేసీఆర్ ఎన్నో సార్లు అసెంబ్లీ సాక్షిగా ప్రస్తావించారని గుర్తుచేశారు. 'కుల వృత్తిని కాపాడేందు కు సీఎం కేసీఆర్ కృషి చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా 35 వేల సెలూన్ లకు సబ్సిడీ విద్యుత్ అందిస్తున్నాం.కుల వృత్తులు ప్రోత్సహిస్తూ మరో వైపు విద్య కు అధిక ప్రాధాన్యత ఇస్తున్నాం. 12 లక్షల కళ్యాణ లక్ష్మి లబ్ధి దారుల్లో 7 లక్షలు బిసి లబ్దిదారులు ఉన్నారు. గతంలో పనిచేసిన ప్రభుత్వాలు బి సి లను ,కులవృతులను నిర్లక్ష్యం చేశాయి. కేసీఆర్ ప్రభుత్వం కుల వృత్తులు ప్రోత్సహిస్తూ మరో వైపు విద్యాపరంగా ఎంతో ప్రోత్సాహం అందిస్తుంది. బిసి లకు 33 శాతం రిజర్వేషన్ కోసం అసెంబ్లీ లో మొట్ట మొదట తీర్మానం చేసిన నాయకుడు సీఎం కేసీఆర్ అని తెలిపారు. 60 ఏళ్ల దేశాన్ని పాలించిన కాంగ్రెస్ హయంలో బిసి గణన ఎందుకు జరగలేదు రాహుల్ గాంధీ సమాధానం చెప్పాలి. దేశంలో ఉన్న బిసి లకు న్యాయం జరగాలి. రెండు సార్లు ఆశీర్వదించి గెలిపించారు. మళ్లీ బి అర్ ఎస్ పార్టీని భారీ మెజారిటీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే బీగాల గణేష్ గుప్తా, నిజామాబాద్ నగర మేయర్ దండు నీతూ కిరణ్, నాయకులు కార్యకర్తలతో పాటు నాయి బ్రాహ్మణ సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రుణమాఫీ చేసి ధాన్యంకొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలి

నవతెలంగాణ-రెంజల్



నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

రైతుల రుణమాఫీ, ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని రెంజల్ మండలంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట మంగళవారం అఖిలభారత ప్రగతిశీల రైతు సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. 2018 సంవత్సరం నుంచి రైతులకు చేసిన రుణమాఫీ ఇంతవరకు అందడం లేదని వారు ఆరోపించారు. అఖిలభారత ప్రగతిశీల రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గుమ్మల గంగాధర్ మాట్లాడుతూ, ఆగస్టు 15 నుంచి విడుదలవారీగా లక్ష రూపాయల లోపు రుణాలను మంజూరు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులను జారీ చేసినప్పటికీ, ఇంతవరకు రైతుల ఖాతాలో డబ్బులు జమ చేయకపోవడం శోచనీయమన్నారు. జిల్లా కలెక్టర్ చొరవ తీసుకొని మాఫీ అయిన రుణాలను రైతులకు అందజేయాలని సూచించారు. ఆరుగాలం కష్ట పడి పండించిన ధ్యానం చేతికి వచ్చిందని, అయినా కొనుగోలు కేంద్రాలు ఇంకా ప్రారంభించలేదని, వెంటనే ప్రారంభించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం రాష్ట్ర నాయకులు పుట్టి నడిపి నాగన్న, కార్మిక సంఘం రాష్ట్ర నాయకులు పార్వతి రాజేశ్వర్, రెంజల్ మండల అధ్యక్షులు పెద్దులు ,ప్రధాన కార్యదర్శి ఎస్కే నసీర్, కోశాధికారి సిద్ధ పోశెట్టి, మైసయ్య, సాయిలు, రవి ,తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్‌శాతం పెంచేలా కృషి చేయండి

- ప్రశాంత వాతావరణంలో ఎన్నికలకు సహకరించాలి
- సభలు, ర్యాలీలకు ముందస్తు అనుమతి తప్పనిసరి
- రాజకీయ పార్టీల నాయకులతో కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు


రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించి మాట్లాడుతున్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

అసెంబ్లీ ఎన్నికల్లో పోలింగ్ శాతం పెంచేందుకు రాజకీయ పార్టీల నాయకులు కృషి చేయాలని కలెక్టర్ రాజీవ్‌గాంధీ తెలిపారు. ఇప్పటికే అందించిన ఓటరు తుది జాబితాను క్షుణ్ణంగా పరిశీలించుకోవాలని సూచించారు. జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు తెలిపారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో మంగళవారం గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రశాంత వాతావరణంలో సాఫీగా ఎన్నికల నిర్వహణకు సహకరించాలని కోరారు. ఎన్నికల షెడ్యూల్ విడుదల అయినందున అన్ని రాజకీయ పక్షాలు తప్పనిసరిగా ఎన్నికల ప్రవర్తన నియమావళిని తుచ తప్పక పాటించాలని కలెక్టర్ సూచించారు. నిబంధనలు ఉల్లంఘించే వారిపై చట్ట ప్రకారం కేసులు నమోదు చేయడం జరుగుతుందని అన్నారు. 80 సంవత్సరాలు దాటిన సీనియర్ సిటిజన్ ఓటర్లు, ఓటరు జాబితాలో మార్కింగ్ కలిగిన దివ్యంగ ఓటర్లు తమ ఇంటి నుండే ఓటు వేసే వెసులుబాటు ఉన్నందున అవసరమైన వారు 12-డీ ఫారం నింపి నవంబర్ 7వ తేదీ లోపు బీఎల్.ఓ లకు అందజేయాలన్నారు. 40 శాతానికి మించి వైకల్యం కలిగిన దివ్యంగులకు మాత్రమే ఇంటి నుండి ఓటు వేసేందుకు అవకాశం కల్పించనున్నట్టు తెలిపారు.

అర్హులైన ఓటర్లు అందరు తప్పనిసరిగా ఓటు హక్కు వినియోగించుకునేలా చొరవ చూపాలని రాజకీయ పార్టీల ప్రతినిధులకు సూచించారు. ముఖ్యంగా అర్బన్ ఏరియాలో పోలింగ్ శాతం గణనీయంగా పెరిగేలా ప్రత్యేక దృష్టిని కేంద్రీకరిస్తున్నామని తెలిపారు. సభలు, సమావేశాలు, ర్యాలీల కోసం కనీసం 48గంటల ముందు అనుమతి కోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. రాత్రి పది గంటల తరువాత మైకులు వాడేందుకు అనుమతి లేదని స్పష్టం చేశారు.

ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లను పూర్తి చేసుకోవాలి

కాగా, ఎన్నికల నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లను పూర్తి చేసుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు అధికారులను ఆదేశించారు. మంగళవారం నోడల్ అధికారులతో సమీక్ష నిర్వహించిన సందర్భంగా కలెక్టర్ కీలక సూచనలు చేశారు. ప్రిసైడింగ్, సహాయ ప్రిసైడింగ్ అధికారులు, మైక్రో అబ్జర్వర్లు, సెక్టోరల్ ఆఫీసర్లు, ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు, కౌంటింగ్ సూపర్వైజర్లు, అబ్జర్వర్ల నియామకాల కోసం సరిపడా సిబ్బందిని గుర్తిస్తూ, ర్యాన్డమైజేషన్ ద్వారా నియామకాలు జరపాలని సూచించారు. కనీసం 20శాతం మేర సిబ్బందిని రిజర్వ్‌లో సిద్ధంగా ఉంచాలని అన్నారు. పోలింగ్, కౌంటింగ్ విధుల కోసం వేర్వేరుగా సిబ్బందిని నియమిస్తూ, ఎన్నికల విధుల పట్ల వారికి పూర్తి అవగాహన కల్పించేలా శిక్షణ తరగతులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు ఎన్నికల ప్రవర్తన నియమావళి ఉల్లంఘనకు సంబంధించిన ఫిర్యాదులు అందిన వెంటనే స్పందించాలని, క్షేత్రస్థాయిలో విచారణ జరిపి వెంట వెంట నివేదికలు సమర్పించాలని అన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ఓటర్లను ప్రలోభాలకు గురిచేసే చర్యలను ఉపేక్షించకుండా కఠిన చర్యలు తీసుకుంటామని, అక్రమ మద్యం, నగదు నిల్వల పై గట్టి నిఘా ఉంచాలని సూచించారు. అన్ని పోలింగ్ కేంద్రాల్లో టాయిలెట్స్, ర్యాంపులు, విద్యుత్, తాగునీరు వంటి మౌలిక సదుపాయాలను పరిశీలించాలని, ఎక్కడైనా లోటుపాట్లు ఉంటే తక్షణమే సౌకర్యాలను అందుబాటులోకి తేవాలని కలెక్టర్ సూచించారు. ఈ సమావేశాల్లో అదనపు కలెక్టర్ పి.యాదిరెడ్డి, అదనపు డీసీపీ జయరాం, నోడల్ అధికారులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలు పరిష్కరించాలి

- సర్వసభ్య సమావేశంలో ప్రజాప్రతినిధులు

నవతెలంగాణ-దోమకొండ


సమావేశంలో మాట్లాడుతున్న ప్రజాప్రతినిధులు

గ్రామాల్లో సమస్యలను ఎప్పటికప్పుడు అధికారులు ప్రణాళిక బద్ధంగా చొరవ తీసుకుని పరిష్కరించాలని ఎంపిపి కానుగంటి శారద నాగరాజు సూచించారు. దోమకొండ మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ శారదా అధ్యక్షతన మండల సర్వ సభ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ శారదా మాట్లాడుతూ వచ్చే ఎండాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని గ్రామాల్లో పైప్ లైన్ లేకేజీ వంటి సమస్యలు లేకుండా తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రతి గ్రామంలో ఎప్పటికప్పుడు వాటర్ ట్యాంకులను క్లోరినేషన్ చేయాలని సూచించారు. రేషన్ కోసం బయోమెట్రిక్ రాని వారి పరిస్థితి ఎలా అని తహశీల్దార్ ని అడగగా అలాంటి వారికి సంబంధించి ఐరిష్ ద్వారా రేషన్ వచ్చేలా చూస్తామని తహసీల్దార్ సంజయ్ రావు తెలిపారు. దోమకొండ మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో ఆక్సిజన్ ప్లాంట్ కు 122 కేవి ట్రాన్స్ ఫార్మర్ ని ఏర్పాటు చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని జడ్పిటిసి తీగల తిర్మల్ గౌడ్ విద్యుత్ అధికారులకు సూచించారు. మరో వారం పదిహేను రోజుల్లో వారి పంట కోతకు వస్తునందున రైతులకు విద్యుత్ సమస్య రాకుండా చూడాలని ప్రజా ప్రతినిధులు సభ్యులు కోరారు. గ్రామాల్లో ప్రమాదంగా ఉన్న ఐరన్ కరెంట్ పోల్స్‌ని తొలగించి వాటి స్థానం లో కొత్త వి ఏర్పాటు చేయాలని విద్యుత్ శాఖ అధికారులకు సభ్యులు సూచించారు. అంగన్ వాడి సెంటర్లను అధికారులు ఎప్పటికప్పుడు పరిశీలించి అంగన్ వాడి సెంటర్లలో పరిశుభ్రత పాటించే విధంగా చూడాలని సభ్యులు కోరారు. ఎలక్షన్ కోడ్ అమలులో ఉన్నందున గ్రామాల్లో ప్రజలు ప్రజా ప్రతినిధులు ఎన్నికల కోడ్‌ని విధిగా పాటించాలని ఎంపీడీవో చిన్నారెడ్డి, తహశీల్దార్ సంజీవ్ రావులు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి కానుగంటి శారద నాగరాజు, జడ్పిటిసి తీగల తిర్మల్ గౌడ్, ఎంపీడీవో చిన్నా రెడ్డి, తహసిల్ దార్ సంజీవ రావు ఎంపిపి బాపు రెడ్డి, సిడిసి చైర్మన్ ఐరేని నర్సయ్య, ఏ ఏం సి చైర్మన్ హన్మంత్ రెడ్డి , విండో చైర్మన్ తిరుపతి గౌడ్, ఎంపీటీసీ సభ్యులు ఫిరంగి రాజేశ్వర్, కడారి రమేష్, కోట సదానంద, నిమ్మ శంకర్,. ఆసాని జ్యోతి , కాటే పల్లి వెంకట లక్ష్మి సర్పంచ్ లు సలీం, సాయిలు, నాంపల్లి మెడికల్ ఆఫీసర్ సంగీత్ కుమార్, ఏ ఈ లు సురేందర్, ప్రదీప్ , మీనా, ఎపివో రజని, ఎపియం రాజు, ఇతర శాఖల అధికారులు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

డిగ్రీ కామర్స్ గెస్ట్ లెక్చరర్ పోస్ట్‌కు నేడు ఇంటర్వ్యూకు ఆహ్వానం

నవతెలంగాణ-సదాశివనగర్

తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాల మర్కల్ కామారెడ్డి నందు కామర్స్ సబ్జెక్టు బోధించుటకు మహిళా అభ్యర్థుల నుండి దరఖాస్తులు కోరుతున్నామనికళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రాధిక మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హత, ఆసక్తి గల మహిళా అభ్యర్థులు బుధవారం కళాశాలలో నిర్వహించే ఇంటర్వ్యూ డెమోకు సంబంధిత సర్టిఫికెట్లతో ఉదయం 10 గంటలకు హాజరు కావాలని సూచించారు.

క్యాంపస్‌లో బాధ్యతలు స్వీకరించిన అధ్యాపకులు


బాధ్యతలు స్వీకరిస్తున్న అధ్యాపకులు

నవతెలంగాణ-భిక్కనూర్

భిక్కనూరు మండలంలోని బిటిఎస్ వద్ద ఉన్న తెలంగాణ సౌత్ క్యాంపస్‌లో బాలుర హాస్టల్ వార్డెన్ గా అసిస్టెంట్ ప్రొఫెసర్ యాలాద్రి, బాలికల హాస్టల్ వార్డెన్ గా అసిస్టెంట్ ప్రొఫెసర్ సునీత, ఉమెన్స్ సెల్ అసిస్టెంట్ డైరెక్టర్‌గా వైశాలి, పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్ గా డాక్టర్ సరిత, ప్రిన్సిపల్ సుధాకర్ గౌడ్ సమక్షంలో మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన వైస్ ఛాన్సలర్ వాకటి కరుణ, రిజిస్టర్ ప్రొఫెసర్ యాదగిరికి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు లలిత, మోహన్ బాబు, హరిత, సబిత, ప్రతిజ్ఞ, నారాయణ, యాలాద్రి, నరసయ్య నిరంజన్, రమాదేవి, శ్రీకాంత్, శ్రీమాతా, దిలీప్, తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నిజామాబాద్
బుధవారం | అక్టోబర్ 11, 2023 | www.navatelangana.com

రాష్ట్రస్థాయి ఎంఎల్‌బి బేస్‌బాల్ పోటీలకు ధర్మారం(బి) విద్యార్థినిల ఎంపిక


విద్యార్థినులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

నవతెలంగాణ-డిచ్‌పల్లి

మండలంలోని ధర్మారం (బి) తెలంగాణ సాంఘిక సంక్షేమ పాఠశాల విద్యార్థులు మండలంలోని సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాల సుద్దపల్లిలో నిర్వహించిన జిల్లాస్థాయి బేస్‌బాల్ పోటీలలో మంచి ప్రతిభను కనబర్చిన ఈ.వర్షిని, ఎస్.నందన, ఐశ్వర్య, లాస్య, శ్రీనిత్య, సుధీర రాష్ట్రస్థాయికి ఎంపిక కావడం జరిగిందని ధర్మారం బి.గురుకుల కళాశాల ప్రిన్సిపాల్ సంగీత మంగళవారం అభినందించారు. హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్సిటీలో 12 నుంచి 14 వరకు జరిగే రాష్ట్రస్థాయి బెస్‌బాల్ పోటీలలో వీరు పాల్గొననున్నారు. వీరిని స్కూల్ ప్రిన్సిపాల్ సంగీత, ఫిజికల్ డైరెక్టర్ నీరజారెడ్డి, పిఈటీ జ్యోష్ణ, హౌస్ మాస్టర్ లత, మమత, సిబ్బంది ప్రత్యేకంగా అభినందించారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థిని అభినందించిన ఉపాధ్యాయ బృందం


విద్యార్థిని అభినందిస్తున్న ఉపాధ్యాయులు

నవతెలంగాణ-ఆర్మూర్

మున్సిపల్ పరిధిలోని మామిడిపల్లి ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థిని గౌతమి ఉమ్మడి జిల్లాల కోకో టోర్నమెంట్లో అద్భుత ప్రతిభ కనపరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు డి.రవీందర్ మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా క్రీడాకారిణిని అభినందించి ఈ నెల 13 నుండి 15 వరకు వనపర్తి జిల్లాలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొననున్నట్లు వ్యాయామ ఉపాధ్యాయులు రాజేశ్వర్ తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ బృందం శోభ, మోహన్, విటల్, సంగీత, శారద, లావణ్య తదితరులు పాల్గొన్నారు.

గురుకుల కళాశాల విద్యార్థినికి స్వర్ణ పతకం



త్రిషను సన్మానించిన ఉపాధ్యాయులు

నవతెలంగాణ-మాక్లూర్

మండలంలోని దాస్‌నగర్ శివారులోని సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలలో తృతీయ సంవత్సరం చదువుతున్న కోలి త్రిష ఇటీవల సౌత్ ఆఫ్రికా దేశంలో జరిగిన 5వ వరల్డ్ కప్ అంతర్జాతీయ టెన్నికాయిట్ ఆటలో తన ప్రతిభను కనపరిచి స్వర్ణ పతకాన్ని సాధించింది. ఈ సందర్భంగా కళాశాల అధ్వర్యంలో ఆమెను మంగళవారం అభినందించారు. ఈ మేరకు కాలేజీ ప్రిన్సిపాల్ డా.కే.లావణ్య మాట్లాడుతూ.. ఇలాంటి విజయాలు మరిన్ని సాధించాలని ప్రోత్సహించారు. ఈ తరఫున కాలేజీ యాజమాన్యం త్రిషను ఘనంగా పూలమాలతో సత్కరించారు.

మనుషులంతా ఒక్కటే..

- దుర్గమాత విగ్రహానికి ముస్లిం యువకుడి విరాళం


ఇబ్రహీం తన వంతు విరాళం అందజేత

నవతెలంగాణ-డిచ్‌పల్లి

నేటి సమాజంలో కుల, మత విద్వేషాలు చెలరేగుతున్న ప్రస్తుత పరిస్థితుల్లో మనుషులంతా ఒక్కటేనని కొన్ని ఘటనలు గుర్తు చేస్తున్నాయి. మనుషులంతా ఒక్కటేనని ప్రతి మనిషిలో మార్పు వస్తే మత విద్వేషాలు, మత ఘర్షణలు తలెత్తవని పలువురు అభిప్రాయ పడుతున్నారు. ఇందల్‌వాయి మండలంలోని నల్లవెల్లి గ్రామంలో మంగళవారం గ్రామ యువకులు కలిసి దుర్గామాత విగ్రహ ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నారు. అందులో భాగంగానే విరాళాల సేకరణ కార్యక్రమంలో భాగంగా నల్లవెల్లి గ్రామానికి చెందిన ముస్లిం యువకుడు మహమ్మద్ ఇబ్రహీం తన వంతు దుర్గమాతకు విరాళం అందించి తన ఔదర్యాన్ని చాటుకున్నాడు. మానవులంతా సమానమని నిరూపించాడు. మహమ్మద్ ఇబ్రహీంను గ్రామ యువకులు అభినందించారు. కార్యక్రమంలో భూసాని మహేష్, పుధరి మనోహర్, పుధరి రాజేందర్, గంగాధర్, మహేష్, చింతలపల్లి రమేష్, తిరుపతి, సృజన, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

అనర్హులకు సంక్షేమ పథకాలు రద్దు చేయాలి

- అంబేద్కర్ విగ్రహానికి వినతి


అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రాన్ని అందజేస్తున్న గ్రామస్తులు

నవతెలంగాణ-నవీపేట్

మండలంలోని తుంగిని గ్రామంలో గృహలక్ష్మి, దళిత బంధు, బీసీ బంధు పథకాలు అనర్హులకు రద్దు చేయాలని గ్రామస్తులు అంబేద్కర్ విగ్రహానికి మంగళవారం వినతిపత్రాన్ని అందజేశారు. గ్రామంలో గృహలక్ష్మికి 46 మంది దరఖాస్తులు చేసుకోగా 46 మందిని అర్హులుగా అధికారులు గుర్తించగా 18 మంది బీఆర్ఎస్ నాయకుల కుటుంబ సభ్యులకు మాత్రమే గృహలక్ష్మి మంజూరు కావడంతో గ్రామస్తులు మంగళవారం సర్పంచ్ భర్త రవీందర్ రావును ప్రశ్నించారు. అనంతరం నిరసనగా అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం సమర్పించి గ్రామస్తుడు రాజేశ్వర్ మాట్లాడుతూ.. అర్హులైన వారికి కాకుండా బీఆర్ఎస్ జెండా మోసిన వారికే సంక్షేమ పథకాలు దళితబంధు, బీసీబంధు గృహలక్ష్మి అందిస్తారా? అని ప్రశ్నించారు. ఒకే ఇంట్లో రెండు, మూడు పథకాలు ఇస్తూ వారే లబ్ధిపొందుతారా? అని ఆగ్రహం వ్యక్తం చేశారు. మా ఓట్లు అవసరం లేదా ఎన్నికల్లో తగిన బుద్ధి చెబుతామని హెచ్చరించారు. వెంటనే అధికారులు స్పందించి అనర్హులైన లబ్ధిదారులను తొలగించి అర్హులకే ఇవ్వాలని డిమాండ్ చేశారు.

చెక్ పోస్ట్‌వద్ద వాహనాల తనిఖీ

- రూ.60వేలు పట్టివేత

నవతెలంగాణ-బోధన్

ఎన్నికల నియమావళి సోమవారం నుంచి అమలులోకి రావడంతో మంగళవారం సాలూర చెక్ పోస్టు వద్ద బోధన్ రూరల్ పోలీసులు తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా బోధన్ నుంచి మహారాష్ట్ర వెళ్తున్న కారును తనిఖీ చేయగా రూ.60వేలు లభించాయి. దానికి ఎలాంటి రసీదులు లేకపోవడంతో ఎస్సై నాగనాథ్ స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్ఐ నాగనాథ్ మాట్లాడుతూ.. 50,000 రూపాయలకు మించి డబ్బులు వెంట తీసుకెళ్లరాదని లేని ఎడల అధిక మొత్తంలో డబ్బులు ఉంటే నిబంధనల ప్రకారం సీజ్ చేస్తామని తెలిపారు.


వాహనాలను తనిఖీ చేస్తున్న ఎస్సై నాగనాథ్

స్కాలర్‌షిప్, ఫీజు రియింబర్స్‌మెంట్ విడుదల చేయాలి

- ఎస్ఎఫ్ఐ నాయకుల డిమాండ్

నవతెలంగాణ-కంఠేశ్వర్

పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్, ఫీజు రియింబర్స్‌మెంట్ వెంటనే విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం భారత విద్యార్థి ఫెడరేషన్ ఎస్ఎఫ్ఐ నిజామాబాద్ నగర కమిటీ ఆధ్వర్యంలో పెండింగ్‌లో ఉన్న స్కాలర్షిప్ ఫీజు రియంబర్స్‌మెంట్, మిస్ కాస్మోటిక్ చార్జీల బిల్లులను విడుదల చేయాలని కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి, ఏవో ప్రశాంత్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా నగర కార్యదర్శి పోషమైన మహేష్ మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలో గత నాలుగు సంవత్సరాల నుంచి స్కాలర్షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్



కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

సకాలంలో చెల్లించడం లేదని, ఈ బకాయిలు దాదాపు 5177 కోట్లు ఉన్నాయని, అయితే విద్యాభ్యాసం పూర్తయిన తర్వాత పై చదువుల రీత్యా ఉద్యోగాల రిత్యా విద్యార్థులు తమ సర్టిఫికెట్లు తీసుకుందామని ప్రైవేట్ కాలేజీలకు వెళ్లినప్పుడు స్కాలర్‌షిప్ రాని కారణంగా సర్టిఫికెట్లు ఇవ్వకపోవడం వల్ల తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. అలాగే సంక్షేమ హాస్టల్లో గత సంవత్సర కాలంగా మెస్ కాస్మోటిక్ చార్జీల బిల్లులు పెండింగ్లో ఉన్న కారణంగా హాస్టల్లో విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించడం లేదని తెలిపారు. దీనివలన విద్యార్థులు తరచుగా అనారోగ్య సమస్యలకు గురవుతున్నారని అన్నారు. కాబట్టి పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్, ఫీజు రియింబర్స్‌మెంట్ అలాగే బిల్లులను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నగర అధ్యక్షులు విశాల్, నగర ఉపాధ్యక్షులు గణేష్, నగర నాయకులు శివ, మోతిలాల్, పవన్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

ప్రశాంతమైన జీవితానికి మానసిక ఆరోగ్యం అవసరం

నవతెలంగాణ-డిచ్‌పల్లి

మనిషి ప్రశాంతమైన జీవితానికి మానసిక ఆరోగ్యం అవసరమని, నేటి సమాజంలో మనిషి తరచూ ఒత్తిడికి గురవుతూ డిప్రెషన్‌లోకి వెళ్లడం జరుగుతుందని, అలాంటి వ్యక్తి ప్రశాంతంగా ఉండాలని మండల ఆరోగ్య విస్తరణ అధికారి వై.శంకర్ అన్నారు. మంగళవారం ఇందల్‌వాయి మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల ఆరోగ్య విస్తరణ అధికారి వై.శంకర్ మాట్లాడుతూ.. శారీరక ఆరోగ్యంతో పాటు మానసికంగా పరిపూర్ణత ఉన్నప్పుడే మనిషి ఆరోగ్యంగా ఉన్నట్లు చెబుతారని, మనిషి ప్రశాంతమైన జీవితానికి మానసిక ఆరోగ్యం అత్యంత అవసరమన్నారు. నేటి సమాజంలో మనిషి తరచూ ఒత్తిడికి గురవుతున్నారని, ఇదే కాకుండా డిప్రెషన్‌కు వెళ్తున్నారని తెలిపారు. అలాంటి వ్యక్తి ప్రశాంతంగా ఉండాలని సూచించారు.


సమావేశంలో మాట్లాడుతున్న అధికారి

మానసికంగా ఆరోగ్యం సరిగా లేకపోవడానికి కారణాలు ఒక వ్యక్తి తన జీవితంలో సమీప బంధువు అతి ఇష్టమైన వ్యక్తి మృతి చెందడం, మద్యం సేవించే అలవాటు ఉండటం, లేదా గృహహింస, తీవ్రమైన శారీరక అనారోగ్యం, ఒంటరితనం, సామాజిక హింస, లాంటివి ఉన్నట్లయితే వారు మానసిక రోగులుగా తయారవుతారని పేర్కొన్నారు. అలాంటి వారి కుటుంబ పరంగా వారి కుటుంబంలో మానసిక వ్యాధులతో బాధపడుతూ ఉన్నట్లయితే వారు కూడా అనుకోకుండా మానస రోగులుగా తయారవుతారని, వారితో ఆరోగ్య కార్యకర్తలు, ఆశాకార్యకర్తలు ప్రశాంతమైన వాతావరణంలో ఆయనతో మాట్లాడాలని, అ బాధను మనం అర్థం చేసుకోవాలని వివరించారు. అలాంటి వారికి కావాల్సిన చికిత్సను ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు తీసుకువచ్చి డాక్టర్ సలహా మేరకు వైద్యాన్ని ప్రారంభించాలని, క్షేత్రస్థాయిలో ఆశా కార్యకర్తలు ఇలాంటి రోగులను గుర్తించి చికిత్స అందించవలసిన అవసరం ఉందన్నారు. ప్రతి ఆరోగ్య కార్యకర్త మానసిక రోగులను ప్రత్యేకంగా వారితో మాట్లాడి వారి సమస్య తెలుసుకొని వారిని పరిపూర్ణ ఆరోగ్యవంతులుగా చేయాలని ఆదేశిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

అభివృద్ధివైపే నిలబడతాం

- బీఆర్ఎస్ అభ్యర్థికి ప్రశాంత్‌రెడ్డికి మద్దతుగా కుల సంఘాల ఏకగ్రీవ తీర్మానాలు

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండలంలోని కోనాపూర్ గ్రామానికి చెందిన నాలుగు కుల సంఘాల సభ్యులు గ్రామంలో కోట్లాది రూపాయలతో పనులు చేపట్టి, గ్రామాన్ని అభివృద్ధి వైపు తీసుకెళ్లిన బిఆర్ఎస్ పార్టీ బాల్కొండ నియోజకవర్గ అభ్యర్థి వేముల ప్రశాంత్‌రెడ్డికే అండగా ఉంటామని పేర్కొంటూ ఏకగ్రీవ తీర్మానం చేసుకున్నారు. ఈ మేరకు మంగళవారం గ్రామంలోని పద్మశాలి సంఘం, శాలివాహన కుమ్మరి సంఘం, అంబేద్కర్ మాదిగ సంఘం, వీసీ తండా కేసీ తండా వాసులు ఆయా కుల సంఘాల్లో సమావేశాలు నిర్వహించుకొని చర్చించుకున్నారు. మెజారిటీ సంఘం సభ్యుల అభిప్రాయాల మేరకు బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థి ప్రశాంత్‌రెడ్డికి మద్దతుగా నిలబడాలని నిర్ణయించుకున్నారు. అనంతరం ప్రశాంత్ రెడ్డికి మద్దతు ప్రకటిస్తూ, తమ ఓట్లన్నీ ప్రశాంత్‌రెడ్డికే వేస్తామని పేర్కొంటూ ఏకగ్రీవ తీర్మానాలు చేశారు. నాలుగు కులసంఘాల సభ్యులు తాము చేసుకున్న ఏకగ్రీవ తీర్మానాల ప్రతులను జడ్పీటీసీ రాధా రాజగౌడ్‌కు అందజేశారు. ఈ సందర్భంగా జడ్పిటిసి మాట్లాడుతూ కోనాపూర్ గ్రామంలో మంత్రిగా ప్రశాంత్‌రెడ్డి చేసిన అభివృద్ధి పనులను గుర్తించి కుల సంఘాల సభ్యులు ప్రశాంత్‌రెడ్డి వెంట ఉంటామని ఏకగ్రీవ తీర్మానాలు చేయడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో


బీఆర్ఎస్ అభ్యర్థికి మద్దతుగా కుల సంఘాల నాయకులు

సర్పంచ్ దయ్య దేవయ్య, ఎంపీటీసీ సభ్యుడు లకావత్ గంగాధర్, సింగిల్‌విండో చైర్మన్ బడాల రమేష్, బిఆర్ఎస్ పార్టీ మండల ఉపాధ్యక్షులు టేకుల రాజు, ఎస్టి సెల్ మండల అధ్యక్షులు లకావత్ సంతోష్, బిఆర్ఎస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు ఉత్కం నర్సాగౌడ్, ఉపసర్పంచ్ టేకుల జలంధర్, పార్టీ నాయకులు రమేష్ రెడ్డి, జలా రాజు, గంగారెడ్డి, చిన్నరెడ్డి, శేఖర్, యూత్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రం సస్యశ్యామలం

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణను బీఆర్ఎస్ ప్రభుత్వం సస్యశ్యామలం చేస్తుందని నుడా చైర్మన్ ఈగ సంజీవరెడ్డి అన్నారు. సోమవారం ఎన్నికల నోటిఫికేషన్ రావడంతో మంగళవారం బోర్గంలోని నూడా చైర్మన్ స్వగృహంలో ఎన్నికల సందడి మొదలైంది. మోపాల్, బోర్గం గ్రామాల కుల సంఘాల సభ్యులతో కొలహలంగా ఏర్పడింది. రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ నిధుల నుంచి సోమవారం ఉదయం కమ్యూనిటీ హల్ ప్రొసీడింగ్ తీసుకున్నవారు మంగళవారం ఉదయం నూడా చైర్మన్ సంజీవరెడ్డిని కలిసి తమ గ్రామాలకు ఎమ్మెల్యే నిధులు ఇప్పించినందుకు ఎమ్మెల్సీ కవితకు, రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్‌కు నూడా చైర్మన్ ఈగ సంజీవరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. మోపాల్ గ్రామ మోటాడి రెడ్డి సంఘానికి 5 లక్షలు, బోర్గం మున్నూరు కాపు సంఘానికి 5లక్షలు, చాకలి సంఘం భవనానికి 5లక్షలు, బెస్తా సంఘం భవనానికి 4లక్షలు, ఎస్‌సి సంఘం భవనానికి 3 లక్షలు అలాగే ఆర్యానగర్ మేస్త్రి సంఘం భవనానికి 5లక్షలు సోమవారం ప్రొసీడింగ్‌లు తీసుకున్నారు. ఈ సందర్భంగా ఒలింపిక్, నూడా చైర్మన్ అయిన ఈగ సంజీవ్‌రెడ్డి కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వం పేద, బడుగు బలహీన వర్గాల ప్రభుత్వమని మన ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు తెలంగాణను కొట్లాడి తెచ్చి మనం కలలు కన్నా బంగారు తెలంగాణగా రాష్ట్రాన్ని శాస్యశ్యామలం చేశాడని అన్నారు. రైతులకు రైతుబంధు, మైనార్టీలకు మైనార్టీ బంధు, బీసీలకు బీసీబంధు, ఎస్సీలకు దళిత బంధు, గృహలక్ష్మి వంటి పథకాలతో రాష్ట్రాన్ని ముందుకు తీసుకుపోతున్నారని అన్నారు. ఈసారి ఎన్నికలలో కూడా బీఆర్ఎస్


చైర్మన్‌ను సన్మానిస్తున్న కుల సంఘాల సభ్యులు

పార్టీని గెలిపించి హ్యాట్రిక్ ముఖ్యమంత్రిని చేయాలని కార్యకర్తలకు సూచించారు. అలాగే బాజిరెడ్డి గోవర్ధన్ భారీ మెజారిటీతో గెలిపించాలని అన్నారు. కార్యక్రమంలో బోర్గాం గ్రామ శాఖ బీఆర్ఎస్ అధ్యక్షులు ఈగ నర్సారెడ్డి, బీఆర్ఎస్ జిల్లా నాయకులు ఈగ శ్రీనివాస్‌రెడ్డి, మాజీ సర్పంచ్ ఎర్రన్న, హన్మాండ్లు, ఎస్.సతీష్‌రెడ్డి, తిరుపతిరెడ్డి, సుమన్, చిట్టీ నారాయణరెడ్డి, బంటు గంగాధస్, సవిన్ రెడ్డి, జీవన్‌రెడ్డి నగేష్, తోపారం శేఖర్, యాదయ్య భూషణ్, రవి, ఆంజనేయులు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగులను మోసం చేస్తున్న ప్రభుత్వాలు

- పివైఎల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె ఎస్ ప్రదీప్

నవతెలంగాణ-ఆర్మూర్

నిరుద్యోగులను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు మోసం చేస్తున్నారని పివైఎల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె యస్ ప్రదీప్ అన్నారు. ప్రగతిశీల యువజన సంఘం జిల్లా మహాసభను పట్టణ కేంద్రంలోని కుమార్ నారాయణ భవన్‌లో మంగళవారం నిర్వహించారు. అంతకుముందు పీవైఎల్ జిల్లా అధ్యక్షుడు బి.కిషన్ జెండా ఆవిష్కరణ చేశారు. మహాసభకు ముఖ్య వక్తగా పీవైఎల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.యస్.ప్రదీప్ మాట్లాడుతూ.. దేశంలో రాష్ట్రంలో యువకులు చెడు వ్యసనాలకు బబానిసై వారి జీవితాలను నాశనం చేసుకుంటూ కుటుంబాలకు దూరమవుతూ చెడు వ్యసనాలకు బానిసవుతున్నారని తెలిపారు. యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించాల్సిన పాలకులు కుల, మత రాజకీయాలకు యువకులను కులం మత్తువైపు మత్తెక్కిస్తున్నారని తెలిపారు. దేశంలో నరేంద్ర మోడీ సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తానని చెప్పిన ప్రభుత్వ


జెండాను ఆవిష్కరణ చేస్తున్న జిల్లా అధ్యక్షుడు ప్రదీప్

రంగ సంస్థలను అమ్మడమే కాకుండా దేశాన్ని అప్పుల పాలు చేస్తున్నారని అన్నారు. మద్యానికి బానిస చేసి వారిని ఎలక్షన్లో ఓటు బొమ్మల్లాగా తయారు చేస్తున్నారని వివరించారు. ఇప్పటికైనా దేశంలోని రాష్ట్రంలోని యువకులందరూ ఆలోచించి దేశంలో రాష్ట్రంలో ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించాల్సిన ప్రభుత్వాలపై ప్రశ్నించే విధంగా తయారు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు బి.కిషన్, ఉపాధ్యక్షులు మారుతీగౌడ్, నాయకులు అనీష్, బి.రవి, టి.శ్రీనివాస్, టి.గంగాధర్, దయాల్‌సింగ్, విజయ్‌కుమార్, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అపరిచిత వ్యక్తులను పోలీసులకు అప్పగించిన గ్రామస్తులు


అపరిచిత వ్యక్తులను పోలీసులకు అప్పగించిన గ్రామస్తులు

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండలంలోని బషీరాబాద్ గ్రామంలో మంగళవారం గ్రామస్తులు ముగ్గురు అపరిచిత వ్యక్తులను పోలీసులకు అప్పగించారు. సర్పంచ్ సక్కారం అశోక్ తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి.. మంగళవారం ఉదయం గ్రామంలో ముగ్గురు వ్యక్తులు ఇంటింటికి తిరుగుతూ 'నాగపూర్‌లో ఆశ్రమం ఉంది. చందాలు ఇవ్వండి.' అంటూ డబ్బులు వసూలు చేస్తున్నారు. అదే సమయంలో ఎస్సీ కాలనీలో ఒకరి ఇంట్లోకి వెళ్లే ప్రయత్నం చేశారు. ఆ ఇంటి పక్కింట్లో ఉండే ముంఢ రమేష్ వారిని పట్టుకొని గ్రామ పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ సమక్షంలో అప్పగించారు. వారి వివరాలను తెలుసుకునేందుకు సర్పంచ్ అశోక్ ప్రయత్నించిన వారి వద్ద సరైన సమాధానం లేకపోవడంతో పోలీసులకు సమాచారం అందించారు. గ్రామానికి చేరుకున్న పోలీసులకు ముగ్గురు అపరిచిత వ్యక్తులను అప్పగించారు. ఈ సందర్భంగా సర్పంచ్ అశోక్ మాట్లాడుతూ గ్రామ ప్రజలు జాగ్రత్తగా ఉండాలని, ఎవరైనా కొత్త వ్యక్తులు వస్తే వారి వివరాలు అడిగి తెలుసుకోవాలని, అనుమానం కలిగితే గ్రామపంచాయతీకైనా, పోలీసులకైనా సమాచారం అందించాలన్నారు.

మరోసారి అవకాశమివ్వండి

- ప్రజా ఆశీర్వాద యాత్రలో ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి


ప్రజా ఆశీర్వాద యాత్రలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

నవతెలంగాణ-మాక్లూర్

ఇప్పటివరకు అనేక అభివృద్ధి పనులు చేపట్టాం. మరోసారి అవకాశం ఇస్తే మరింత అభివృద్ధి చేసుకుందాం. నాకు మరోసారి అవకాశమివ్వండి.' అని ఆర్మూర్ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని కల్లెడ గ్రామంలో ప్రజా ఆశీర్వాద యాత్రను ఆర్మూర్ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామంలోని కుల సంఘాల వద్దకు వెళ్లి ప్రజలను ఎమ్మెల్యే కలిశారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి ప్రభాకర్, వైస్ ఎంపిపి సిక్కి సుజాత, సొసైటీ వైస్ చైర్మన్ రమేష్, సర్పంచులు పుప్పాల లక్ష్మి గంగారెడ్డి, అనుగు గంగాధర్, ఉప సర్పంచ్ మనీష్ గౌడ్, నాయకులు గండ్డం సాగర్, చిన్న రమేష్, తదితరులు పాల్గొన్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్ల వేతనాలు 30శాతం పెరుగుదల పట్ల హర్షం

నవతెలంగాణ-ముప్కాల్

ఉపాధిహామీ ఫీల్డ్ అసిస్టెంట్ల వేతనాలను పెంచుతూ పంచాయతీరాజ్ ప్రిన్సిపాల్ సెక్రటరీ సందీప్ సుల్తానియా ఉత్తర్వులు జారీచేశారు. ఈ సందర్భంగా ఫీల్డ్ అసిస్టెంట్ల సంఘం అధ్యక్షులు జగదీష్ యాదవ్ మంగళవారం సాయంత్రం హర్షం వ్యక్తం చేశారు. ప్రస్తుత వేతనం రూ.8,900 నుంచి రూ.11,570 లకు (30శాతం) పెరిగిందన్నారు. అటు ప్రభుత్వానికి, మరోవైపు ప్రజాప్రతినిధులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో ముప్కాల్ ఫీల్డ్ అసిస్టెంట్ల సంఘం నాయకులు గోల్కొండ మహేష్, కన్నయ్య, శ్రీహరి, భూమేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

మిర్ధాపల్లిలో సీఎంఆర్ఎఫ్, కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ

నవతెలంగాణ-ఆర్మూర్

మండలంలోని మిర్ధాపల్లి గ్రామంలో మంగళవారం బీఆర్ఎస్ అధ్యక్షులు, పీయూసీ చైర్మెన్, ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్‌రెడ్డి మంజూరు చేయించిన సీఎంఆర్ఎఫ్, కల్యాణలక్ష్మి చెక్కులను లబ్ధిదారులు తుమ్మల రవళి, గడ్డకింది కార్తీక్‌కు సర్పంచ్ మధు వర్మ, ఎంపీటీసీ భూమన్న పంపిణీ చేశారు. కార్యక్రమంలో నర్సింహరెడ్డి, ఏలేటి భోజన్న, గంగారెడ్డి, తూర్పు సాయరెడ్డి, సంతోష్, మీరా మధు కుమార్, ఏనుగు సాయరెడ్డి, రాజన్న, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.


కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేస్తున్న ప్రజాప్రతినిధులు

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
కామారెడ్డి
బుధవారం | అక్టోబర్ 11, 2023 | www.navatelangana.com

అవినీతి పాలన అంతమొందించాలి

నవతెలంగాణ-రెంజల్

రాబోయే ఎన్నికలలో అవినీతి పాలనను అంతమొందించి బిజెపి పార్టీ తెలంగాణలో అధికారం వస్తుందని బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డీ మోహన్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని తాడ్‌బిలోలి, బోర్గం, సాటాపూర్ గ్రామాలలో గడపగడపకు ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ.. స్థానిక యువత అసెంబ్లీ ఎన్నికల్లో ఉత్సాహంగా పనిచేస్తున్నారని, బీఆర్ఎస్ పార్టీ గద్దె దించుతామని, బోధనలో బిజెపి జెండా ఎగురవేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి మండల అధ్యక్షులు గోపికృష్ణ, రెంజల్ మండల ఉపాధ్యక్షులు క్యాతం యోగేష్, మాజీ మండల అధ్యక్షులు మేక సంతోష్, బిజెపి మండల ప్రధాన కార్యదర్శి సంగం శ్రీనివాస్, బుజ్జి ,స్థానిక నాయకులు పార్థ రమేష్, సంతోష్, అజయ్, తదితరులు పాల్గొన్నారు.

మంథనిలో పోలీసుల తనిఖీలు

● ధ్రువపత్రాలు చూపని వాహనాలు సీజ్



నవతెలంగాణ-ఆర్మూర్

త్వరలో అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా మంగళవారం పోలీసు కమిషనర్ ఆదేశాల మేరకు మండలంలోని మంథని గ్రామంలో పోలీసు శాఖ తరపున కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం నిర్వహించారు. ఆధారాలు చూపని 37 బైకులను సీజ్ చేశారు. అలాగే ప్రతి ఒక్కరూ వారి ఓటు హక్కును సద్వినియోగపరుచుకునే విధంగా ప్రజలకు ధైర్యాన్ని నింపుతూ పోలీసు కవాతు సైతం నిర్వహించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ జగదీష్ చందర్, స్టేషన్ హౌస్ ఆఫీసర్ సురేష్ బాబు, సబ్ డివిజన్లోని ఎస్సైలు, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రాజకీయ నాయకులు ఎన్నికలకు సహకరించాలి

● కలెక్టర్ జితేశ్ వి పాటిల్

నవతెలంగాణ-కామారెడ్డి



పార్టీ ప్రతినిధులతో కలెక్టర్ సమావేశం



ఈవీఎంలు, వీవీప్యాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్

శాసనసభకు సాధారణ ఎన్నికల షెడ్యూల్ విడుదలైన నేపథ్యంలో జిల్లాలో ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలని జిల్లా కలెక్టర్, ఎన్నికల అధికారి జితేష్ వి పాటిల్ కోరారు. మంగళవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని కాన్ఫరెన్స్ హాల్లో మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ పై రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు రాజకీయ పార్టీల ప్రతినిధులు లేవనెత్తిన సందేహాలకు అధికారులు సమాధానం ఇచ్చారు.

జిల్లా కలెక్టర్, ఎన్నికల అధికారి మాట్లాడుతూ వచ్చే నెల 3 వ తేదీన ఎన్నికల నోటిఫికేషన్ వస్తుందని, 10 తేదీ వరకు నామినేషన్లు స్వీకరించనున్నట్లు తెలిపారు. 13వ తేదీన నామినేషన్ల పరిశీలన ఉంటుందని, 15 వ తేదీ వరకు నామినేషన్ల ఉపసంహరణకు చివరి తేదీ అన్నారు. 30 వ తేదీన ఎన్నికల పోలింగ్ ఉంటుందని, డిసెంబర్ 3 వ తేదీన ఎన్నికల ఫలితాల లెక్కింపు జరుగుతుందని తెలిపారు.

కొత్తగా ఓటు నమోదు చేసుకోవాలంటే ఎవరూ ఆందోళన చెందవద్దని, నామినేషన్ల స్వీకరణకు 10 రోజుల ముందు వరకు ఓటు హక్కు నమోదు చేసుకోవచ్చని తెలిపారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళిని పకడ్బందీగా అమలు చేస్తామని తెలిపారు. తుది ఓటరు జాబితాలో ఎవరిదైనా ఓటు హక్కు లేకపోతే సంబంధిత బూత్ లెవెల్ ఎలక్టోరోల్ ఏజెంట్ రిటర్నింగ్ అధికారి దృష్టికి తీసుకురావాలని సూచించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. సి- విజిల్, 1950 నెంబర్, ఎన్జీఆర్ఎస్‌కు వచ్చే ఫిర్యాదులకు సత్వర స్పందన అందిస్తామన్నారు. రిటర్నింగ్ అధికారుల కార్యాలయాల వద్ద సువిధ కేంద్రం ఉంటుందని, ఆన్ లైన్ లేదా ఆఫ్ లైన్ ద్వారా ఎన్నికల ప్రచారాలకు, ర్యాలీలకు, బహిరంగ సభలు, తదితర వాటి కోసం అనుమతి తీసుకోవచ్చని తెలిపారు. వీటి అనుమతి కోసం 48 గంటల ముందుగానే దరఖాస్తు చేసుకోవాలనే విషయాన్ని ప్రతీ ఒక్కరూ గమనించాలని సూచించారు. సంబంధిత రిటర్నింగ్ అధికారులు కూడా తమ స్థాయిలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో మీటింగ్ పెట్టాలని అన్నారు. ఎవరైనా ఓటర్లను ప్రభావితం చేసేవిధంగా, ప్రలోభపెట్టే విధంగా చేస్తే సీ విజిల్ అప్లికేషన్ లో కంప్లైంట్ ఇవ్వచ్చని, 100 నిమిషాల్లో కంప్లైంట్ ను పరిశీలించి, వెరిఫై చేసి పరిష్కారం చూపడం జరుగుతుందని తెలిపారు. ఫస్ట్ లెవెల్ చెకప్ కు ఉపయోగించిన ఈవీఎం మెషీన్ ల జాబితా, ఎన్నికల పరిశీలకుల సమక్షంలో ర్యాండమైజేషన్ అయ్యే ఈవీఎం ల జాబితా ప్రతినిధులకు సమర్పించడం జరుగుతుందని పేర్కొన్నారు.

ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా, ప్రశాంతంగా, పారదర్శకంగా ఎన్నికలు జరిపేందుకు రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకారం అందించాలని అన్నారు. సామాజిక మాధ్యమాల్లో ప్రజలను ప్రలోభపెట్టే విధంగా, ప్రభావితం చేసే విధంగా పోస్టులు పెట్టకూడదని, అలా చేస్తే సంబంధిత వ్యక్తులతో పాటు గ్రూప్ అడ్మిన్ లపై కూడా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. యంత్రాంగం సోషల్ మీడియా మీద ప్రత్యేక నిఘా ఉంటుందని తెలిపారు. ఎన్నికల సమయంలో తాత్కాలికంగా పార్టీ కార్యాలయాలు ఏర్పాటు చేసుకుంటే ముందుగా అనుమతి తీసుకోవాలని అన్నారు. ఏవైనా ఫిర్యాదులు ఉంటే ఆన్ లైన్ లో లేదా నేరుగా కార్యాలయంలో ఇవ్వవచ్చని తెలిపారు.

కామారెడ్డి పట్టణంలోని ఈవీఎం కేంద్రం ను జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్, అదనపు కలెక్టర్ చంద్రమోహన్, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు సందర్శించారు. కేంద్రంలో ఉన్న ఈవీఎంలు, వీవీ ప్యాట్లను పరిశీలించారు. కార్యక్రమంలో ఎన్నికల విభాగం అధికారులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

కంట్రోల్ రూమ్ పరిశీలన

కామారెడ్డి కలెక్టరేట్లో మీడియా సర్టిఫికేషన్, మానిటరింగ్ కమిటీ, కంట్రోల్ రూమ్‌ను మంగళవారం జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ పరిశీలించారు. ఎంసిఎంసి విధులు, బాధ్యతలను అధికారులకు వివరించారు. ఎన్నికల వ్యయం పరిశీలనకు ప్రత్యేక విభాగం ఏర్పాటు చేసినట్లు చెప్పారు. కంట్రోల్ రూమ్ ను పరిశీలించారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ చంద్రమోహన్, కలెక్టరేట్ ఏవో మసూర్ అహ్మద్, నోడల్ అధికారులు పాల్గొన్నారు.



పలకలు, పెన్సిల్స్, బిస్కెట్లు పంపిణీ



బిస్కెట్లు పంపిణీ చేస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు

నవతెలంగాణ-ఎడపల్లి

మండలంలోని వడ్డేపల్లి, మంగల్‌పహాడ్ ఆయా గ్రామాల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలతో పాటు అంగన్వాడీ కేంద్రాలలో లయన్స్ క్లబ్ ఆఫ్ ఎడపల్లి ఆధ్వర్యంలో బాల బాలికలకు ఉచితంగా పలకలతోపాటు బిస్కెట్లను పంపిణీ చేసినట్టు లయన్స్ క్లబ్ ఆఫ్ ఎడపల్లి అధ్యక్షురాలు మెర్సి తెలిపారు. గ్రామీణ ప్రాంతాలలో ఉన్న ప్రభుత్వ పాఠశాలలో నెలకొన్న సమస్యలతో పాటు అంగన్వాడీ కేంద్రాలలో ఉన్న సమస్యలను పరిష్కరించే దిశగా లయన్స్ క్లబ్ ఆఫ్ ఇంటర్నేషనల్ సంస్థ ఎల్లప్పుడూ తోడుగా ఉంటుందని ఆమె గుర్తు చేశారు. ఏది ఏమైనప్పటికీ ఎడపల్లి మండలంలో ఉన్న 17 గ్రామ పంచాయతీ పరిధిలోగల ప్రభుత్వ పాఠశాలలతో పాటు అంగన్వాడీ కేంద్రాలలో తమ వంతు సేవా కార్యక్రమాలను అందజేస్తామని ఆమె స్పష్టం చేశారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ఆఫ్ ఎడపల్లి అధ్యక్షురాలు మెర్సి ప్రధాన కార్యదర్శి కదం ప్రకాష్‌రావు, కోశాధికారి గంగారెడ్డి, మంగళ్‌పాడ్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు అభిమన్యు, ఉపాధ్యాయులు శంకర్‌ల తోపాటు వడ్డేపల్లి అంగన్వాడి ఉపాధ్యాయురాలు దేవ కుమారి, లయన్స్ క్లబ్ ప్రతినిధులు గంగారెడ్డి, పుష్పవతి, మనోజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పాలిటెక్నిక్, సీఎస్ఐ కళాశాలలను పరిశీలించిన కలెక్టర్, సీపీ



కళాశాలను పరిశీలిస్తున్న కలెక్టర్, సీపీ

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లలో భాగంగా కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు, పోలీస్ కమిషనర్ వి.సత్యనారాయణ మంగళవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలుర, బాలికల పాలిటెక్నిక్ కళాశాలలు, సి.ఎస్.ఐ జూనియర్ కాలేజీలను పరిశీలించారు. సాధారణ ఎన్నికల నోటిఫికేషన్ వెలువడిన నేపథ్యంలో ఓట్ల లెక్కింపు, ఎన్నికల సామాగ్రి పంపిణీ, ఈవీఎంలను భద్రపరిచేందుకు స్ట్రాంగ్ రూమ్ వంటి వాటికి అనువుగా ఉన్న కేంద్రాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. రవాణా, పార్కింగ్ సదుపాయాలతో పాటు, భద్రతాపరమైన అంశాలను పరిశీలన జరిపారు. జిల్లాలోని మొత్తం ఆరు అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించిన కౌంటింగ్, స్ట్రాంగ్ రూమ్ ల కోసం అనువైన భవనాలు, గదులను పరిశీలించారు. లీకేజీలు ఏమైనా ఉన్నాయా అన్నది క్షుణ్ణంగా పరిశీలన జరపాలని తన వెంట ఉన్న ఆర్ అండ్ బీ ఇంజినీర్లను కలెక్టర్ ఆదేశించారు. అదనపు కలెక్టర్ పి.యాదిరెడ్డి, అదనపు డీసీపీ జయరాం, అగ్నిమాపక శాఖ అధికారి మురళిమనోహర్, నిజామాబాద్ ఆర్డీఓ రాజేంద్ర కుమార్ తదితరులతో కౌంటింగ్, డిస్ట్రిబ్యూషన్ సెంటర్లకు సంబంధించిన విషయాలపై చర్చించారు. ఎలాంటి అవాంతరాలకు తావులేకుండా ఎన్నికల నిర్వహణ సాఫీగా జరిగేలా అన్ని వసతులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. కలెక్టర్ వెంట ఏసీపీ కిరణ్ కుమార్, ఎన్నికల విభాగం పర్యవేక్షకుడు పవన్ తదితరులు ఉన్నారు.

శ్రీ కాలభైరవ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజ

నవతెలంగాణ-రామారెడ్డి

మండలంలోని శ్రీ కాలభైరవ స్వామి దేవస్థానంలో మంగళవారం స్వామివారికి సింధూర పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కలు తీర్చుకున్నారు. భక్తుల సందడి అధికంగా ఉండటంతో ఆలయ కమిటీ భక్తుల కోసం అన్ని ఏర్పాట్లు చేసింది. అన్నదాన కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు.

గంజాయి విక్రయిస్తున్న నలుగురు అరెస్ట్

600 గ్రాముల గంజాయి పట్టివేత

నవతెలంగాణ-భీంగల్

మండలంలోని బడా భీంగల్ గ్రామ పరిసరాలలో గల ఎల్లమ్మ గుడి వద్ద గంజాయి విక్రయిస్తున్న నలుగురిని పట్టుకొని రిమాండ్‌కు తరలించినట్టు ఎస్సై హరిబాబు తెలిపారు. మంగళవారం పోలీస్ స్టేషన్లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో సిఐ వెంకటేశ్వర్లుతో కలిసి ఎస్సై వెల్లడించిన వివరాలు ఇలా ఉన్నాయి. ఎన్నికల కోడ్‌లో భాగంగా సిపి సత్యనారాయణ ఆదేశాల మేరకు మంగళవారం సిబ్బందితో కలిసి పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా బడాభీంగల్ పరిసర ప్రాంతంలోని ఎల్లమ్మ గుడి వద్ద గంజాయి విక్రయిస్తున్నారన్న సమాచారం మేరకు దాడి చేయగా నిజామాబాద్ ముస్తాక్‌పురకు చెందిన షేక్ షాదుల్, డిచ్‌పల్లి మండలం సుద్దాపల్లి, గ్రామానికి చెందిన మేకల రమేష్, గాంధీనగర్‌కు చెందిన సయ్యద్ హుస్సేన్, ధర్పల్లి మండలం దుబ్బాకకు చెందిన పిప్పెర రాజేష్ 600 గ్రాముల గంజాయితో పట్టుకున్నామని వారి వద్ద గల నాలుగు సెల్‌ఫోన్లు, హెచ్ఎఫ్ డీలక్స్ బైకును స్వాధీనం చేసుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించి విచారించగా నిజామాబాద్‌కు చెందిన యునూస్ వద్ద కొనుగోలు చేసి ఎక్కువ ధరకు అమ్ముతున్నట్లు నిందితులు వెల్లడించినట్లు ఎస్సై తెలిపారు. కేసు నమోదు చేసుకొని రిమాండ్ కు తరలించినట్లు ఆయన తెలిపారు. ఈ కేసులో చాకచక్యంగా వ్యవహరించిన కానిస్టేబుల్ రాజ్‌కుమార్, రంజిత్, దయానంద్, గంగాధర్‌ను సిఐ వెంకటేశ్వర్లు అభినందించారు.



పలువురిని అరెస్టు చేసిన పోలీసులు

దిల్‌రాజుకు పితృవియోగం



నవతెలంగాణ-మోపాల్

మండలంలోని నర్సింగ్‌పల్లి గ్రామానికి చెందిన సినీ నిర్మాత దిల్‌రాజు తండ్రి ఉమ్మడి ముదక్‌పల్లి మాజీ సర్పంచ్ శ్యాంసుందర్‌రెడ్డి అంత్యక్రియలు మంగళవారం జూబ్లీహిల్స్‌లోని మహాప్రస్థానంలో ముగిసాయి. గత కొన్ని రోజుల నుంచి అనారోగ్యంతో బాధపడుతున్న శ్యాంసుందర్‌రెడ్డి సోమవారం రాత్రి మృతిచెందిన విషయం తెలిసిందే. కాగా ఆయన అంత్యక్రియలకు సినీ ప్రముఖులు చిరంజీవి, ప్రకాష్‌రాజ్ తదితరులు హాజరై నివాళులర్పించారు. ఆయన మరణ వార్త తెలిసిన వెంటనే నర్సింగ్‌పల్లి గ్రామస్తులు కన్నీరు మున్నీరయ్యారు. ఆయన అంత్యక్రియలకు మండల కేంద్రానికి చెందిన నాయకులు తరలివెళ్లారు. ఇదిలా ఉండగా శ్యాంసుందర్‌రెడ్డికి ముగ్గురు కుమారులున్నారు. పెద్ద కుమారుడు నరసింహారెడ్డి నర్సింగ్‌పల్లిలో గల ఇందూరు తిరుమల క్షేత్రం బాధ్యతలు చూస్తారు.

పల్లె పల్లెకు కాంగ్రెస్ పథకాలు

● జిల్లా అధ్యక్షులు మానాల మోహన్ రెడ్డి

నవతెలంగాణ-ఆర్మూర్

పల్లె పల్లెకు కాంగ్రెస్ పథకాలు అనే నినాదంతో ఆరు గ్యారంటీ పథకాలను ప్రజలలోకి తీసుకెళ్తామని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు మానాల మోహన్‌రెడ్డి అన్నారు. ఆలూరు మండలంలో మంగళవారం కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని కాంగ్రెస్ నాయకులు, గోర్తా రాజేందర్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పల్లె పల్లెకు కాంగ్రెస్ అనే నినాదంతో ఆలూరు మండల కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారెంటీ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లారు. 6 గ్యారంటీ పథకాలతో కార్యకర్తలకు, ప్రజలకు ఎంతో ఉత్సాహాన్ని ఇచ్చిందని వారు తెలిపారు. కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలివచ్చారు. కాంగ్రెస్ ఆరు గ్యారెంటీ పథకాలపై ప్రజలకు నమ్మకం ఏర్పడిందని గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే కరెంటు బకాయిలు ఉచిత కరెంటు నూతన రుణాలు ఇచ్చిన కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తేవడానికి ప్రజలు కోరుకుంటున్నారని వారు చెప్పారు. నిరుద్యోగ భృతి, డబుల్ బెడ్ రూం, రైతు రుణమాఫీ అనేక విషయాలతో మోసం చేసిన టిఆర్ఎస్ ప్రభుత్వాన్ని గద్దె దించడం ఖాయమని ఉన్నారు. ఈసారి మళ్లీ మోసపూరితమైన మేనిఫెస్టోని తీసుకొని టిఆర్ఎస్ రాబోతుందని వారిని తరిమి తరిమి కొట్టాలని హెచ్చరించారు. కెసిఆర్ మోసపూరిత హామీలను నమ్మవద్దని భవిష్యత్తు తరాలకు కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యమని సూచించారు.ఎక్కడికెళ్లిన ఆర్మూర్ నియోజక వర్గ ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారని, కాంగ్రెస్ గెలుపు కాదు మెజారిటీ లక్ష్యంగా ప్రజల్లో ఉత్సాహం కనిపిస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో పొద్దుటూరు వినయ్ రెడ్డి, డేగ పోశెట్టి, తాహెర్‌బిన్ హందాన్, కోల వెంకట్, ఆలూరు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు విజయ్, పుట్టింటి శ్రీనివాస్‌రెడ్డి, ఉదయ్, నవనీత్, మల్లారెడ్డి, గ్రామ ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



కాంగ్రెస్ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న నాయకులు

యువత.. దేశానికి రక్ష

● కానిస్టేబుల్‌కు ఎంపికైన వారికి సన్మానం

నవతెలంగాణ-ఎడపల్లి



కానిస్టేబుల్‌కు ఎంపికైన భార్గవిని సన్మానిస్తున్న ప్రజాప్రతినిధులు

నేటి యువత దేశానికి రక్షకులు అని, ప్రజాస్వామ్యాన్ని ప్రజలను కాపాడుతూ ఉంటారని ఎడపల్లి ఉపసర్పంచ్ ఆటో శ్రీనివాస్ అన్నారు. ఎడపల్లి మండల కేంద్రానికి చెందిన మిర్యాల భార్గవి ఎస్కే ఆసీన్ లు ఇటీవల ఏ ఆర్ పోలీస్ ఉద్యోగులకు ఎంపికైనందున మంగళవారం ఎడపల్లి మండల కేంద్రంలోని ఇరువురిని స్థానిక ప్రజాప్రతినిధులు అధికారులు గ్రామ పెద్దలు యువకులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పోలీస్ ఉద్యోగం కత్తి మీది సాములాంటిదని, అయినప్పటికీ ఓ యువతి ఓ యువకుడు ఎడపల్లి మండలం నుండి పోలీస్ ఉద్యోగంలో ఎంపిక కావడం మండలానికి గర్వకారణం అని అన్నారు. నిరుపేద కుటుంబాలలో జన్మించిన మిర్యాల భార్గవి తల్లిదండ్రులు రోజువారి కూలిగా పనిచేస్తూ గ్రామ గ్రామాన తిరుగుతూ తమ బిడ్డను ఓ స్థాయికి తీసుకురావడం ఆనందం గా ఉందన్నారు. అలాగే షేక్ హుస్సేన్ అనే యువకుడు కూడా నిరుపేద కుటుంబానికి చెందిన యువకుడు అని, పట్టుదల కృషితో పోలీసు ఉద్యోగాన్ని సాధించాలని లక్ష్యంతో ఆయన ఉద్యోగాన్ని సాధించారని తెలిపారు.

కార్యక్రమంలో జడ్పీ వైస్ చైర్మన్, ఉప సర్పంచ్ ఆకుల శ్రీనివాస్, ఎడపల్లి ఎంపీటీసీలు స్రవంతి పోతన్న, మనిషా రెడ్డి,షేక్ జావిద్ బాబా, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ అధికారంలోకి వస్తేనే అభివృద్ధి



వర్ని : కాంగ్రెస్ పార్టీ ఇంటింటి ప్రచారం



రెంజల్ : కాంగ్రెస్‌లో చేరిన ధనుంజయ

నవతెలంగాణ-వర్ని/రెంజల్

మండలంలోని అపాంది ఫారం గ్రామంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. పార్టీ 6 గ్యారంటీ పథకాలను ప్రచారం చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే పేదల కష్టాలు తొలుగుతాయని తెలిపారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే అభివృద్ధి జరుగుతుందని మండల అధ్యక్షులు సురేష్ బాబా తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర యూత్ కాంగ్రెస్ నాయకులు బాన్సువాడ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కాసుల రోహిత్ ,కిసాన్ కాంగ్రెస్ కామారెడ్డి జిల్లా మాజీ అధ్యక్షులు హన్మండ్లు, ఓబీసీ జిల్లా కార్యదర్శి గబ్బర్ సింగ్, సురేష్, కిసాన్ ఖేత్ మండల అధ్యక్షులు శనిగరం కిషన్, మైనారిటీ సెల్ మండల అధ్యక్షులు శంషుద్దీన్, సేవదాల్ మండల అధ్యక్షులు వి.హనుమంతరావు, యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ ప్రదాన కార్యదర్శి సోహెబ్, చందూర్ మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు మహేందర్ ,వర్ని మండల యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు ఇమ్రాన్, కార్యదర్శి దయానంద్, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీలో పలువురి చేరిక

రెంజల్ : రెంజల్ మండలం గండిగుట్ట గ్రామానికి చెందిన మార్కెటింగ్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ ధనుంజయ టిఆర్ఎస్ పార్టీ నుంచి కాంగ్రెస్ పార్టీ లో చేరారు. కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన ఆరు గ్యారెంటీ పథకాలకు ఆకర్షితులై ఈ పార్టీలో చేరినట్లు ఆయన తెలిపారు. ఆయనతో పాటు దండిగుట్ట బీఆర్ఎస్ గ్రామ కమిటీ అధ్యక్షులు రామచందర్ కూడా కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు మోబిన్ ఖాన్, జి సాయి రెడ్డి, సిహెచ్ రాములు జావిద్ ఉద్దీన్, తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నిజామాబాద్
బుధవారం | అక్టోబర్ 11, 2023 | www.navatelangana.com

అర్బన్ ప్రైవేట్ వ్యాయమ ఉపాధ్యాయుల కమిటీ ఏర్పాటు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

నిజామాబాద్ పట్టణ వ్యాయామ ఉపాధ్యాయుల సంఘం కమిటీని మంగళవారం ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా అజ్మత్‌ఖాన్, ప్రధాన కార్యదర్శిగా మీసాల ప్రశాంత్ కుమార్, కోశాధికారిగా గంగామురళిని ఎన్నుకున్నారు. త్వరలో పూర్తి కార్యవర్గాన్ని ఎన్నుకోనున్నట్టు తెలిపారు. గత 20 సంవత్సరాల నుండి అర్బన్‌లో వ్యాయమ ఉపాధ్యాయులుగా వివిధ పాఠశాలలో సేవలు అందిస్తూ ఎంతో మంది క్రీడాకారులను రాష్ట్ర, జాతీయస్థాయి క్రీడల్లో పాల్గొనే విధంగా సహకరించారు. క్రీడా అభివృద్ధికి కృషి చేయాలని వీరిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అధ్యక్ష, కార్యదర్శులు మాట్లాడుతూ.. క్రీడాల అభివృద్ధికి జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ కార్యవర్గం జిల్లా క్రీడా సంఘాల సహకారంతో క్రీడా అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో పట్టణ వ్యాయమ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కిసాన్ కాంగ్రెస్ పట్టణాధ్యక్షుడిగా బాలకిషన్

నవతెలంగాణ-ఆర్మూర్



నియామకపత్రాన్ని అందజేస్తున్న కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షులు

కిసాన్ కాంగ్రెస్ పట్టణాధ్యక్షుడిగా బోడమీది బాలకిషన్ నియామకమయ్యారు. ఆ నియామకపత్రాన్ని కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షులు అన్వేష్‌రెడ్డి మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తనపై నమ్మకం ఉంచి ఈ బాధ్యత అప్పగించినందుకు ధన్యవాదాలు తెలిపారు. రైతుల సమస్యలపై పోరాడుతూ అలాగే కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే చేసే పనులను రైతులకు వివరించి పార్టీ గెలుపునకు కృషి చేస్తానని బాలకిషన్ అన్నారు. కార్యక్రమంలో పీసీసీ ప్రచార కమిటీ సభ్యులు కోలా వెంకటేష్, జిల్లా అధ్యక్షులు ముప్ప గంగారెడ్డి, సాయిబాబాగౌడ్, అఖిల్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ వినియోగదారుల పరిష్కార వేదిక

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

విద్యుత్ వినియోగదారుల పరిష్కార వేదిక నిజామాబాద్ ఆధ్వర్యంలో బుధవారం ఉదయం 10:30 గంటల నుండి మధ్యాహ్నం 1 గంటల వరకు మున్నూరు కాపు సంఘం మండపం గుర్‌బాబాది రోడ్డు, దుబ్బ సబ్‌స్టేషన్ దగ్గరలో నిర్వహిస్తామని ఏడిఈ టౌన్ తోట రాజశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి సిజిఆర్ ఎఫ్2, చైర్‌పర్సన్ కే.ఈశ్వరయ్య, మెంబర్ టెక్నికల్ ఎస్.రామకృష్ణ, మెంబర్ ఫైనాన్స్ ఎల్.కిషన్, ఫోర్త్ మెంబర్ ఎం.రాజాగౌడ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తామని తెలిపారు. కావున వినియోగదారులు తమ సమస్యలను నివేదించుకోవాలని సూచించారు. డీ2 సెక్షన్ తిలక్ గార్డెన్, డీ3 సెక్షన్ దుబ్బ, డీ9 సెక్షన్ సుభాష్‌నగర్, డీ5 సెక్షన్ గంగాస్థాన్‌లలోని వినియోగదారులు వచ్చి సమస్యలు తెలుపాలని పేర్కొన్నారు.

మహిళలను వేధిస్తే కఠిన చర్యలు

- సీపీ వి.సత్యనారాయణ

నవతెలంగాణ-కంఠేశ్వర్

ఎవరైనా ఆకతాయిలు విద్యార్థులను, మహిళలను వేధింపులకు గురిచేస్తే వారిపట్ల కఠినచర్యలు తీసుకుంటామని నిజామాబాద్ పోలీస్ కమిషనర్ వి.సత్యనారాయణ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నిజామాబాద్ పోలీస్ కమిషనరేటు పరిధిలోగల నిజామాబాద్, ఆర్మూర్, బోధన్ డివిజన్‌లో షీటీమ్ బృందాలను నిఘా ఉంచామని, ఎవరైనా మహిళలపట్ల అసభ్యంగా ప్రవర్తించినా, వేధింపులకు గురిచేసినా షీ టీమ్ సెల్ నెంబర్ 8712659795 గానీ లేదా డయల్ 100 గానీ ఫోన్ చేసి తెలియజేయగలరని పేర్కొన్నారు. ప్రస్తుతం 01-09-2023 నుండి 30-09-2023 వరకు నిజామాబాద్ కమిషనరేట్‌లోని నిజామాబాద్, ఆర్మూర్, బోధన్ డివిజన్ పరిధిలోగల షీ టీమ్స్ ద్వారా పట్టుబడిన కేసుల వివరాలు ఇలా ఉన్నాయి. నిజామాబాద్‌లో 06, ఆర్మూర్‌లో 02, బోధన్‌లో 02 మొత్తం 10 ఘటనలు చోటుచేసుకున్నాయి. కాగా నిజామాబాద్‌లో పట్టుబడిన వారు 07, ఆర్మూర్‌లో 02, బోధన్‌లో 03, మొత్తం 12 మంది పట్టుబడినట్టు తెలిపారు. నిజామాబాదులో పెట్టి కేసులు 05, ఆర్మూర్‌లో 02, బోధన్‌లో 02 నమోదయ్యాయని పేర్కొన్నారు. నిజామాబాద్, ఆర్మూర్, బోధన్‌లలో ఎఫ్.ఐ.ఆర్‌లు నమోదు కాలేవని, నిజామాబాద్‌లో కౌన్సెలింగ్ చేయబడిన వారు 01 అని తెలిపారు.

14వ రోజు రిలే నిరాహారదీక్షలు



రిలే నిరాహారదీక్షలు నిర్వహిస్తున్న గ్రామ ప్రజలు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

చంద్రబాబునాయుడు అక్రమ అరెస్టుకు నిరసనగా టీడీపీ ఆధ్వర్యంలో నిజామాబాద్ జిల్లా కేంద్రంలో చేపట్టిన దీక్షలు 14వ రోజుకు చేరాయి. అయితే ధర్మారం గ్రామ ప్రజలు ధర్మారం నుంచి కాలినడకన నిజామాబాద్ ధర్నాచౌక్‌లోని శిబిరానికి చేరుకొని రిలే నిరాహారదీక్షలకు సంఘీభావం తెలిపారు. గత 32 రోజులుగా చంద్రబాబు నాయుడుని అరెస్టు చేసి, ఎలాంటి ఆధారాలు చూపకుండా కాలం వెళ్లదీస్తున్నారని మండిపడ్డారు. బాబుతో మేము అంటూ నినాదాలు చేస్తూ పెద్ద ఎత్తున సంఘీభావం తెలిపారు. స్కిల్ స్కాం పేరుతో అవినీతి చేశారని అంటున్న మేధావి వర్గం, నిరూపించకుండా కాలయాపన చేయడానికి మండిపడ్డారు. ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసే విధంగా, ఆంధ్రప్రదేశ్లో పాలన కొనసాగుతుందని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి జగన్‌పై ఆవేదన వ్యక్తం చేశారు. సుప్రీంకోర్టు ఇచ్చే తీర్పు న్యాయవ్యవస్థను నమ్మేలా ఉంటుందని అనుకుంటున్నామని అన్నారు. చంద్రబాబు నాయుడు అవినీతి చేయని ఒక మంచి సీఎం అని అన్నారు. ఒక మంచి లీడర్‌షిప్‌ను తయారుచేసిన గొప్ప నాయకుడని అన్నారు. కార్యక్రమంలో వినోద్‌కుమార్, రెంజర్ల సురేష్, కమ్మ సంఘం అధ్యక్షులు రావుల సుబ్బారావు, పిచ్చేశ్వర్‌రావు, అంజనెలు, గోపి, కేశవులు, మాధవ్, కస్తూరి, పద్మ, రాజమ్మ, బొబ్బ నరసింహ, షేక్ ఫిరోజ్, అంబిక సత్యనారాయణ, శంకర్ ముదిరాజ్, ధర్మారం గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

గ్రామ అభివృద్ధికి అన్నీ తానై

- సేవలను అందిస్తున్న విట్టల్



అన్ని పనులు తానే చేస్తున్న పారిశుధ్య కార్మికుడు

నవతెలంగాణ-రెంజల్

మండలంలోని కిసాన్ తండా గ్రామ పారిశుధ్య కార్మికుడు విట్టల్ అన్ని పనులు తానే చేసుకుంటూ గ్రామంలోని పరిసరాల పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టిని సారించారు. తెలంగాణ ప్రభుత్వం గిరిజన తాండాలను గ్రామపంచాయతీలుగా ప్రకటించిన విషయం తెలిసిందే. అందులో భాగంగా అతి చిన్న గ్రామమైన కిసాన్ తాండాను పంచాయతీగా ఏర్పాటు చేసింది. అయితే ఆ పంచాయతీలో విఠల్ పారిశుధ్య కార్మికుడిగా పనిచేస్తున్నారు. గ్రామంలోని పారిశుధ్య పనులతో పాటు, ట్రాక్టర్ నడిపించడం, విద్యుత్ దీపాల ఏర్పాటు, డ్రయినేజీలను శుభ్రం చేయడం, లీకేజీలను మరమ్మతు చేయడం, వాటర్‌మెన్‌గా ఇవన్నీ పనులు అన్నీ తానై చేస్తున్నాడు. మంగళవారం పైపులైనుకు లీకేజ్ కావడంతో ఆయనొక్కడే దగ్గరుండి మరమ్మతులు పూర్తి చేశారు. చిన్న గ్రామం కావడంతో ఒకే ఒక్క కార్మికుడిని గ్రామపంచాయతీ నియమించింది. ప్రభుత్వం అందిస్తున్న తొమ్మిది వేల రూపాయల గౌరవేతనంతో కుటుంబాన్ని నెట్టుకు వస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

తొర్లికొండలో పేకాటరాయుళ్ల అరెస్టు

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

మండలంలోని తొర్లికొండ గ్రామంలో పేకాట రాయుళ్లను అరెస్టు చేసినట్టు జక్రాన్‌పల్లి ఎస్సై తిరుపతి మంగళవారం తెలిపారు. తొర్లికొండ గ్రామ శివారులో పేకాట ఆడుతున్న వారిని అరెస్టు చేసి వారి వద్ద ఉన్న పేక ముక్కలను డబ్బులను స్వాధీనం చేసుకున్నట్టు తెలియజేశారు. బుధవారం పేకాటరాయులని తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేస్తామని తెలియజేశారు.

ఏటీఎంలలో వరుస చోరీలు

- తగిన రక్షణ లేకపోవడమే కారణం?
- జనసంచారం తక్కువగా ఉండే ప్రాంతాలే టార్గెట్

నవతెలంగాణ-ఆర్మూర్

ఇటీవల పలు బ్యాంకుల ఏటీఎంలలో దోపిడీ దొంగల బీభత్సంపై స్థానిక ప్రజలు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. సోమవారం వేల్పూర్ మండలంలోని అంక్సాపూర్ గ్రామ 63వ నెంబరు జాతీయ రహదారి వద్ద ఉన్న ఆంధ్ర బ్యాంకు ఎటీఎంలో దొంగలు చోరీకి పాల్పడి విఫలయత్నమయ్యారు. ఏకంగా ఏటీఎం మెషిన్‌ను ధ్వంసం చేసి గ్రామపంచాయతీ ట్రాక్టర్‌ను దొంగలించే ప్రయత్నం చేయగా గ్రామస్తులు వెంబడించడంతో దొంగలు పరారయ్యారు. గత మూడు రోజుల క్రితం 44వ నెంబరు జాతీయ రహదారి పక్కన దూదిగాం శివారులోని ఎస్బిఐ బ్యాంక్ పక్కన ఉన్న ఏటీఎంలో దొంగలు చోరీకి పాల్పడ్డారు. గ్యాస్ కట్టర్‌తో ఏటీఎంను ధ్వంసం చేసి అందులోని 12.46లక్షలను ఎత్తుకెళ్లారు. భీంగల్‌లో సైతం ఏటీఎంలో చోరీ జరిగింది. గత సంవత్సరం జూలై రెండవ తేదీ మెండోరా మండలంలోని బుస్సాపూర్‌లో తెలంగాణ గ్రామీణ బ్యాంకులో ఉత్తరప్రదేశ్‌కు చెందిన దొంగల ముఠా చోరీకి పాల్పడి లాకర్‌ను ధ్వంసం చేసి 8న్నర కిలోల బంగారు ఆభరణాలు, 1.75 లక్షల



నగదు ఎత్తుకెళ్లిన ఘటన తీవ్ర సంచలనం రేపింది. దూదిగాం శివారులోని ఏటీఎంలో చోరీకి పాల్పడిన దొంగలు హర్యానాకు చెందినవారుగా పోలీసులు అనుమానిస్తున్నారు. దీంతో దర్యాప్తును వేగవంతం చేసి దొంగల ఆచూకీ కోసం గాలిస్తున్నారు. ముఖ్యంగా రాత్రి వేళల్లో జనసంచారం తక్కువగా ఉండే ప్రాంతాలను ఎంచుకొని బ్యాంకులు ఏటీఎంలో వద్ద తగిన రక్షణ లేకపోవడాన్ని గమనించి చోరీలకు పాల్పడుతున్నారని వాదనలు వినిపిస్తున్నాయి.

దొంగలను పట్టుకుంటాం

ఏటీఎంలలో చోరీకి పాల్పడిన దొంగలను త్వరలోనే పట్టుకుంటాం. నిందితుల కోసం ముమ్మర గాలింపు చర్యలు చేపడుతున్నాం. బ్యాంకులు, ఏటీఎంలో వద్ద తగిన రక్షణ ఏర్పాట్లను చేసుకోవాలి.

- అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ జగదీష్ చందర్

బీఆర్ఎస్‌లో పలువురి చేరికలు

- పార్టీలోకి ఆహ్వానించిన ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్‌రెడ్డి

నవతెలంగాణ-ఆర్మూర్

ఎన్నికల నేపథ్యంలో నియోజకవర్గంలోని అన్ని గ్రామాల నుంచి రోజు రోజుకూ పెరుగుతున్న చేరికల జోరుతో బీఆర్ఎస్‌లో హుషారు కనిపిస్తోంది. అభివృద్ధి చూసే గులాబీ గూటికి సకల జనుల అడుగులు పడుతున్నాయని పార్టీ శ్రేణులు అంటున్నాయి. రాష్ట్రంలో సీఎం కేసీఆర్, నియోజకవర్గంలో ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ఆకర్షితులై ఇతర పార్టీల నుంచి నాయకులు, కార్యకర్తలు బీఆర్ఎస్‌లోకి వస్తున్నారని స్థానిక బీఆర్ఎస్ నేతలు చెబుతున్నారు. మంగళవారం కూడా బీఆర్ఎస్‌లోకి వలసల వరద పోటెత్తింది. ఆర్మూర్ నియోజకవర్గ పరిధిలోని ఆలూరు మండలం కల్లెడ గ్రామంలో ఎన్నికల ప్రచారంలో భాగంగా నిర్వహించిన "ప్రజా ఆశీర్వాద యాత్ర" సందర్భంగా 'కల్లెడ తండా వాసులు' సభ్యులు తమ పూర్తి మద్దతు బీఆర్ఎస్ పార్టీకేనని తెలిపి ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. అలాగే కల్లెడ గ్రామంలో 'గూండ్ల సంఘం'



పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే

సభ్యులు, 'మొటాటి రెడ్డి సంఘం' సభ్యులు, 'యాదవ సంఘం' సభ్యులు, దేగాం గ్రామానికి చెందిన మాల సంఘం సభ్యులు, పట్టణంలోని హౌసింగ్ బోర్డ్ కాలనీకి చెందిన పద్మశాలి సంఘం సభ్యులు, పట్టణానికి చెందిన నాయీబ్రాహ్మణ సంఘం సభ్యులు, పట్టణంలోని హౌసింగ్ బోర్డ్ కాలనీకి చెందిన మహిళలు పీయూసీ చైర్మన్, ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు ఆశన్నగారి జీవన్‌రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్ తీర్థం పుచ్చుకున్నారు. వారందరికీ జీవన్‌రెడ్డి బీఆర్ఎస్ కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా జీవన్‌రెడ్డి మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శమన్నారు. బీఆర్ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యమన్న ఆయన 62 ఏళ్ల కాంగ్రెస్, బిజెపి పాలనలో ప్రజలకు జరిగిన లాభం శూన్యమన్నారు. ఎన్నికల సమయంలోనే ఓట్ల గురించి ఆలోచించే కేసీఆర్ పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలను అందించాలని ఆలోచనలు చేస్తారని అన్నారు. ఆర్మూర్ నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి యజ్ఞంలో భాగస్వామ్యం అయ్యేందుకు వచ్చిన వారిని ఆయన అభినందించారు. మనసున్న మహారాజు ముఖ్యమంత్రి కేసీఆర్ అని, ఆయనకు సకల జనుల సంక్షేమమే ముఖ్యమని తెలిపారు. బీఆర్ఎస్ అభివృద్ధి, ప్రజా సంక్షేమానికి బ్రాండ్ అంబాసిడర్ అని ఆయన పేర్కొన్నారు. పార్టీలో చేరిన వారికి సముచిత స్థానం కలిపిస్తామని ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పట్టణ అధ్యక్షులు పూజ నరేందర్, నాయకులు పండిత్ పవన్, చాలా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

తపస్విలో అన్నదానం, పండ్లు పంపిణీ



పిల్లలకు అన్నం, పండ్లు పంపిణీ

నవతెలంగాణ-ఆర్మూర్

మున్సిపల్ పరిధిలోని మామిడిపల్లి తపస్వి స్వచ్ఛంద సేవ సంస్థలో పిప్రి గ్రామ బ్రహ్మంగారి గుడి ఆలయ కమిటీ సభ్యులు సుంకం భూషణ్ పుట్టినరోజు సందర్భంగా పిల్లలకు అన్నదానం, అరటిపండ్లు మంగళవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో యూత్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

పెంటాఖుర్దూ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయురాలిపై విచారణ



ఫిర్యాదు చేస్తున్న ఎస్ఎఫ్ఐ విద్యార్థి సంఘం నాయకులు

నవతెలంగాణ-బోధన్

బోధన్ మండలం పెంటాఖుర్దు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో రత్న కుమారి అనే ఉపాధ్యాయురాలు ఏకరూప దుస్తుల కోసం విద్యార్థుల నుంచి డబ్బులు వసూలు చేయడంపై ఎస్ఎఫ్ఐ విద్యార్థి సంఘ నాయకులు మండల విద్యాశాఖ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదు ఆధారంగా మంగళవారం ఎంఈఓ నాగనాథ్, జీసీడీఓ వనిత పాఠశాలలో విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ డివిజన్ కార్యదర్శి సాయికుమార్ మాట్లాడుతూ రత్నకుమారి అనే ఉపాధ్యాయురాలు విద్యార్థులకు టీసీ ఇవ్వడానికి సైతం డబ్బులు వసూలు చేశారని ఆరోపించారు. సదరు ఉపాధ్యాయురాలు తీరుపై నిష్పక్షపాతంగా విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కోరారు.

బీసీల ఐక్యతకు ప్రతి ఒక్కరూ కదలాలి

నవతెలంగాణ-భీంగల్

బీసీల ఐక్యతకు ప్రతి ఒక్కరూ కదలాలని బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి నిజామాబాద్ జిల్లా అధ్యక్షుడు అశోక్‌గౌడ్ పిలుపునిచ్చారు. తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మేకపోతుల నరేందర్‌గౌడ్ ఆదేశాల మేరకు మంగళవారం భీంగల్ జేబీఎన్ ఫంక్షన్ హాల్‌లో బీసీల చైతన్య వేదిక, నూతన కమిటీని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అబ్బగోని అశోక్‌గౌడ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా బీసీలను ఉద్దేశించి మాట్లాడుతూ.. బీసీలకు రావలసిన వాటా ప్రకారం చట్టసభలలో బీసీల రిజర్వేషన్లను తక్షణమే ప్రకటించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అదేవిధంగా అన్ని పార్టీలు బీసీల దమాషా ప్రకారం దేశవ్యాప్తంగా ఉన్నటువంటి 57శాతం బీసీలకు అసెంబ్లీ స్థానాలలో సీట్లను కేటాయించాలని



బీసీ చైతన్య వేదిక నూతన కమిటీ ఏర్పాటు

డిమాండ్ చేశారు. దేశంలోనే అత్యధిక జనాభా కలిగినటువంటి బీసీలకు రాజ్యాధికారం రావాలంటే బీసీలకే ఓటు వేసుకోవాలని తెలిపారు. అదేవిధంగా తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం భీంగల్ మండలాధ్యక్షుడు గంగారం మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాలలో నూతన కమిటీలు ఏర్పాటు చేసి అధ్యక్ష, ఉపాధ్యక్షులు కార్యదర్శులను నియమించామన్నారు. త్వరలోనే భీంగల్‌లో భారీ బహిరంగ సభ ఏర్పాటు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో మండలంలోని ఆయా గ్రామాల బీసీ నాయకులు, అధ్యక్షులు, ఉపాధ్యక్షులు కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.

హెడ్‌కుక్, స్వీపర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

నవతెలంగాణ-భీంగల్

పట్టణ కేంద్రంలోని కస్తూర్బాగాంధీ పాఠశాలలో హెడ్ కుక్, స్వీపర్ పోస్టులకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు మండల విద్యాధికారి స్వామి తెలిపారు. హెడ్ కుక్‌కు పదవ తరగతి, స్వీపర్‌కు ఏడవ తరగతి పాసై, వంట చేయుటలో ఐదు సంవత్సరాల అనుభవం కలిగి ఉండాలని పేర్కొన్నారు. కాంట్రాక్ట్ పద్ధతిన చేపట్టే ఈ పోస్టులకు భీంగల్ వాసులకు మొదటి ప్రాధాన్యం ఉంటుందని తెలిపారు. కనుక అర్హులైన మహిళలు ఈ నెల 11 నుండి 14లోపు ఎంఈఓ కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలని ఎంఈఓ తెలిపారు.

అమృత స్మృతి వనం ఏర్పాటు

నవతెలంగాణ-బాల్కొండ

మేరీ మట్టి మేరా దేశ్ ముగింపు సందర్భంగా బాల్కొండ మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో మంగళవారం ముగింపు కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా అన్ని మండలాల నుంచి తీసుకొచ్చిన మట్టిని ఒకదగ్గర చేసి పార్టీ కార్యాలయానికి పంపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బాల్కొండ అసెంబ్లీ కన్వీనర్ మల్కన్నగారి మోహన్ పాల్గొని మాట్లాడుతూ దేశం నలుమూలల నుంచి మట్టి సేకరించి ఢిల్లీలో దేశంకోసం అసువులు బాసిన ఎందరో త్యాగధనులకు అమృత స్మృతి వనం ఏర్పాటు చేస్తారన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు నిమ్మల శ్రీనివాస్, బాల్కొండ, ముప్కాల్, మెండోరా, ఏర్గట్ల, మోర్తాడ్, వేల్పూర్, భీంగల్, మండలాధ్యక్షులు అంబటి నవీన్, గడ్డం సంతోష్, కోమన్‌పల్లి నడ్పి సాయన్న, ఏలేటి నారాయణ రెడ్డి, పుప్పాల



మేరీ మట్టి మేరా దేశ్ ముగింపు కార్యాక్రమాలు నిర్వహిస్తున్న నాయకులు

నరేష్, రమేష్ రెడ్డి, మహిపాల్, లక్ష్మి నర్సయ్య, బిజేపీ నాయకులు ఆరెపల్లి నర్సయ్య, జక్కం శ్రీకాంత్, కొత్తింటి రాకేష్, దినేష్, సత్యనారాయణ, శివ, రాంకిషన్, శివానంద్, లింగం తదితరులు పాల్గొన్నారు.

ఫ్యాక్టరీని తెరిపించే వరకూ దీక్షలు

నవతెలంగాణ-బోధన్‌టౌన్

బోధన్ నిజాంషుగర్ ఫ్యాక్టరీని తెరిపించే వరకు దీక్షలను విరమించబోమని ఫ్యాక్టరీ కార్మికులు హెచ్చరించారు. ఫ్యాక్టరీ కార్మికులు బోధన్ పట్టణంలోని నిజాం షుగర్ ఫ్యాక్టరీ ఎదుట చేపడుతున్న దీక్షలు మంగళవారం నాటికి 67వ రోజుకు చేరుకున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు ఫ్యాక్టరీని పున:ప్రారంభించాలని డిమాండ్ చేశారు. దీక్షలో ఫ్యాక్టరీ కార్మికులు తదితరులు కూర్చున్నారు.



దీక్ష నిర్వహిస్తున్న ఫ్యాక్టరీ కార్మికులు

అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా శ్యాంరావు

నవతెలంగాణ-బోధన్



బోధన్ మండలం ఖండ్‌గాం గ్రామానికి చెందిన సీనియర్ న్యాయవాది శ్యాంరావు అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా మంగళవారం నియామకం అయ్యారు. తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో చురుకుగా పనిచేసిన శ్యాంరావు, గత స్థానిక ఎన్నికల్లో ఎంపీటీసీగా గెలుపొంది ప్రజలకు సేవలందించారు. అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ గా నియామకం అయిన శ్యాంరావుకు పట్టణ ప్రముఖులు శుభాకాంక్షలు తెలిపారు.

ఉరేసుకొని మహిళ ఆత్మహత్య

నవతెలంగాణ-జక్రాన్ పల్లి

మండలంలోని పుప్పాలపల్లి గ్రామానికి చెందిన ఓ మహిళ ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుందని జక్రాన్ పల్లి ఎస్సై తిరుపతి తెలిపారు. పుప్పాలపల్లి గ్రామానికి చెందిన దావుల లతకు 11 సంవత్సరాల క్రితం పెండ్లి కాగా ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఆదివారం బంధువుల ఇంటికి భార్య భర్తలు ఫంక్షన్‌కు వెళ్లి వచ్చారు. సోమవారం ఉదయం చూసేసరికి దావుల లత ఇంట్లో ఉరి వేసుకుని మృతి చెందినట్లు ఎస్సై తెలిపారు. లతకు ఆరోగ్యపరంగా నరాల బలహీనతతో బాధపడుతోందని దీంతో పాటు భర్త ఇతరులకు అక్రమ సంబంధం ఉందన్న అనుమానంతో ఆత్మహత్య చేసుకున్నట్టు తెలుస్తోందని ఎస్సై తెలిపారు. మృతురాలు దావుల లత తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామన్నారు.